ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 26.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 276 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

మూడో టీ20కి రెడీ.. సిరీస్ పైనే గురి 8

ఒడిశాలో భారీ ఎన్‌కౌంటర్

మావోయిస్టు కీలక నేత పాకా హనుమంతు హతం

- మరో ఐదుగురు మావోయిస్టులు కూడా
- హనుమంతుపై రూ.1.10 కోట్ల రివార్డు
- పుల్లెంల గ్రామంలో విషాదం

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

భువనేశ్వర్, డిసెంబర్ 25: ఒడిశాలోని కంధమాల్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్‌జరిగింది. మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు కీలక నేత, కేంద్ర కమిటీ సభ్యుడు పాకా హనుమంతు అలియాస్ గణేశ్ ఉయికే తోపాటు మరో ఐదుగురు మావోయిస్టులు మరణించారు. ఇందులో మహిళలు కూడా ఉన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, జిల్లాలోని గుమ్మా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్టు సమాచారం అందడంతో పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఓ చోట మావోయిస్టులు ఎదురుపడగా పరస్పరం కాల్పులు చోటుచేసుకున్నాయి. అందులో పలువురు మావోలు హతమయ్యారు. మరణించిన వారిలో గణేశ్‌తోపాటు రాజేశ్ తివారీ, చమ్రు, రూప ఉన్నారు. గురువారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్ తీవ్రవాదాన్ని అరికట్టడానికి, శాంతిని కొనసాగించడానికి నిరంతర ప్రయత్నాలను హైలైట్ చేస్తుందని ఒడిశా పోలీసులు తెలిపారు. అదే సమయంలో ఘటనాస్థలిలో ఒక రివాల్వర్, పాయింట్ 303 రైఫిల్, ఒక వాకీటాకీ సెట్, రెండు ఐఎన్ఎస్ఏఎస్ రైఫిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మావోయిస్టుల కోసం బలగాల గాలింపు కొనసాగుతోంది. కంధమాల్, గంజాం జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో 20 స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్స్ (ఎస్ఓజీ) బృందాలు, రెండు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్) బృందాలు, ఒక బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) దళాలతో కూడిన 23 బృందాలు మోహరించాయి. అయితే ఇటీవల మల్కన్‌గిరిలో 22 మంది మావోయిస్టులు ఆయుధాలను విడిచిపెట్టి లొంగిపోయారు.

గణేశ్ ఉయికేది తెలంగాణనే

అయితే హనుమంతు స్వస్థలం తెలంగాణలోని నల్గొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామం అని అధికారులు తెలిపారు. అతడు కీలకమైన

...:: మిగతా 2లో



ఇక మావోయిస్టులతో చర్చలు జరపం

- ఒడిశా ఎన్‌కౌంటర్‌కీలక విజయం
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి సిద్ధం
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడి

12 జోన్లు, 60 సర్కిళ్లు

తుది దశకు జీహెచ్‌ఎంసీ డివిజన్ల పునర్విభజన ప్రక్రియ

- రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడమే తరువాయి
- జీహెచ్‌ఎంసీ, సికంద్రాబాద్ సైబరాబాద్
- మూడు కార్పోరేషన్లుగా విభజన
- పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే
- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 25: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పాలనాపరమైన సంస్కరణలకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా హైదరాబాద్ డివిజన్ల పునర్విభజన ప్రక్రియ దాదాపు ముగింపు దశకు చేరుకోవడంతో క్షేత్రస్థాయిలో పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు జోన్లు, సర్కిళ్ల సంఖ్యను భారీగా పెంచాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ నిర్ణయించారు. ఈ ప్రతిపాదిత ప్రణాళికపై రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడమే తరువాయి, వారం రోజుల్లో కొత్త సర్కిళ్లు, జోన్ల హద్దులను ఖరారు చేస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. గతంలో 650 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న జీహెచ్‌ఎంసీ.. ఇటీవల 27 శివారు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల విలీనంతో

...:: మిగతా 2లో

అర్ధరాత్రి వరకు లిక్కర్

- 31న రాత్రి 12 వరకు వరకు మద్యం విక్రయాలు
- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- నగరంలో పటిష్ట బందోబస్తు: సీపీ సజ్జనార్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 25: న్యూ ఇయర్ వేళ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మద్యం

...:: మిగతా 2లో

పెన్ డ్రైవ్‌లో ఏముంది?

- ఫోన్ ట్యాపింగ్ కేసు.. కీలకం కానున్న పెన్ డ్రైవ్
- వందల సంఖ్యలో ఫోన్ నంబర్లు, వ్యక్తిగత సమాచారం
- బీఆర్ఎస్ నేతలకు కునుకు లేకుండా చేస్తున్న డ్రైవ్
- దీని ఆధారంగానే కేసీఆర్, హరీష్‌లకు నోటీసులు?

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 25: తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు అనూహ్య మలుపు తిరిగింది. ఇన్నాళ్లూ విచారణ, అరెస్టుల చుట్టూ తిరిగిన ఈ కేసు దర్యాప్తు ఇప్పుడు ఒక పెన్‌డ్రైవ్ కేంద్రంగా మారింది. అందులో నిక్షిప్తమైన సమాచారం బీఆర్ఎస్ అగ్రనాయకత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు వద్ద లభించిన ఈ పెన్‌డ్రైవ్‌లో ట్యాపింగ్‌కు సంబంధించిన పక్కా ఆధారాలు ఉన్నాయని సిట్ భావిస్తోంది. ఈ సాక్ష్యాల ఆధారంగానే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులకు నోటీసులు జారీ చేసేందుకు రంగం

...:: మిగతా 2లో

క్రీస్తు బోధనలు సామరస్యాన్ని బలోపేతం చేయాలి

- క్రిస్మస్ స్ఫూర్తి మంచితనాన్ని ప్రేరేపించాలి
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ
- ఢిల్లీలోని కేథడ్రల్ చర్చి ప్రార్థనలో పాల్గొన్న ప్రధాని

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: క్రిస్మస్ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఢిల్లీలోని కేథడ్రల్ చర్చ్ ఆఫ్ ది రిడంప్షన్‌లో ప్రార్థనా సర్వీస్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ దేశ ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. యేసు క్రీస్తు బోధనలు సమాజంలో సామరస్యాన్ని బలోపేతం చేయాలని కోరారు. ఢిల్లీ, ఉత్తర భారత క్రైస్తవ సమాజం పెద్ద సంఖ్యలో హాజరైన ఈ కార్యక్రమంలో ప్రార్థనలు, సాంప్రదాయ క్యారల్స్, హిమ్స్‌లతో సందడి వాతావరణం నెలకొంది. ఢిల్లీ బిషప్ ఆర్‌టి. రెవ. డాక్టర్ పాల్ స్వరూప్ ప్రధానికి ప్రత్యేక ప్రార్థన చేశారు. 'ఢిల్లీలోని కేథడ్రల్ చర్చ్ ఆఫ్ ది రిడంప్షన్‌లో క్రిస్మస్ ఉదయ సర్వీస్‌లో పాల్గొన్నాను. ఈ సర్వీస్ ప్రేమ, శాంతి, కరుణ యొక్క శాశ్వత సందేశాన్ని ప్రతిబింబిస్తుంది. క్రిస్మస్ స్ఫూర్తి మన సమాజంలో సామరస్యం, మంచితనాన్ని ప్రేరేపించాలి' అని ప్రధాని ఈ సందర్భంగా ట్విటర్‌లో తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రధాని మోదీ క్రైస్తవ సమాజ కార్యక్రమాల్లో క్రియాశీలంగా పాల్గొంటున్నారు. 2023లో ఈస్టర్ సందర్భంగా సేక్రెడ్ హార్ట్ కేథడ్రల్‌లో నిర్వహించిన ప్రార్థనకు మోదీ హాజరయ్యారు.

అసెంబ్లీకి కేసీఆర్ వస్తారా?

- రావాలని సీఎం రేవంత్‌సవాల్
- ఏ అంశామైనా చర్చించేందుకు రెడీ
- ముఖాముఖి తేల్చుకుందామని వెల్లడి
- ఫోన్‌ట్యాపింగ్‌తో బీఆర్ఎస్‌ను కార్నర్ చేయాలని ప్లాన్
- కృష్ణా వాటర్ విషయంలో కేసీఆర్ ఎక్స్‌పోజ్ కు స్కెచ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 25: కృష్ణా జలాల విషయంలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన ఆరోపణలపై సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించారు. చిట్ చాట్ పేరుతో అన్ని అంశాలపై మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి ఏకంగా కొడంగల్ వేదికగా కేసీఆర్‌కు పెద్ద సవాలు చేశారు. ఈ నెల 29 నుంచి అసెంబ్లీ స్టార్ట్ అవుతుందని, 'నీళ్లా.. నిధులా.. నియమకాలా, సంక్షేమ పథకాలా.. ఆప్షన్ మీదే.. ఏ అంశామైనా చర్చించేందుకు రెడీ' అంటూ ఓపెన్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. ముఖాముఖి తేల్చుకుందాం రమ్మంటూ సవాల్ చేస్తున్నారు. అయితే అన్ని అంశాల కంటే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని రేవంత్ ప్రధాన అస్త్రంగా వాడుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. అసెంబ్లీ వేదికగా ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని చర్చకు పెట్టి, బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా కార్నర్ చేయాలనేది రేవంత్ వ్యూహమని తెలుస్తోంది. ఇదే సమయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సభకు వస్తే, కృష్ణా జలాల ఎపిసోడ్‌కు కూడా రేవంత్‌రెడ్డి అక్కడే ఫుల్ స్టాప్ పెట్టాలనుకుంటున్నారని సమాచారం. సభలు పెట్టి కేసీఆర్ ప్రజల్లోకి వెళ్లే కంటే ముందే అసెంబ్లీకి రావాలంటూ సవాల్ చేస్తూ రేవంత్ కొత్త ఎత్తుగడ వేశారన్న చర్చ జరుగుతోంది. కృష్ణాజలాల అంశంతో పొలిటికల్‌గా యాక్టీవ్ కావాలని

...:: మిగతా 2లో

కర్ణాటకలో ఘోర బస్సు ప్రమాదం

- 17 మంది సజీవ దహనం.. 13 మందికి తీవ్ర గాయాలు
- అదుపు తప్పి ప్రయివేటు బస్సును ఢీకొన్న లారీ
- డీజిల్‌ట్యాంకుకు ఢీకొనడంతో చెలరేగిన మంటలు
- చిత్రదుర్గం జిల్లాహిరియూర్ సమీపంలో ఘటన

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

చిత్రదుర్గం, డిసెంబర్ 25: కర్ణాటకలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. చిత్రదుర్గం జిల్లా హిరియూర్‌సమీపంలోని జాతీయ రహదారిపై ఒక స్లీపర్ బస్సుకు మంటలు అంటుకున్నాయి. ఓ లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చెలరేగింది. ఈ ఘటనలో 17 మంది సజీవదహనం అయ్యారు. బస్సులో ప్రయాణిస్తున్న మరో 13 మంది గాయపడ్డారు. చిత్రదుర్గ జిల్లా హిరియూర్ తాలుకాలోని హోర్లథు క్రాసింగ్ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున 3 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. హియూరు

...:: మిగతా 2లో



శ్యామ్‌ప్రసాద్ కల సాకారం

ఆర్టికల్ 370 రద్దుతో శ్యామ్‌ప్రసాద్ కల సాకారం చేశామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. జమ్మూకాశ్మీర్‌లో భారత రాజ్యాంగం అమలు చేశామని చెప్పారు. గురువారం లక్నోలో జరిగిన వాజ్‌పేయి 101వ జయంతి కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు.

7

అజ్ఞాతాన్ని వీడిన ఖలీదా జియా కుమారుడు

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు, బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ(బీఎన్‌పీ)కి కాబోయే అధినేత తారీఖ్ రహ్మాన్ 17 ఏళ్ల స్వీయ అజ్ఞాతవాసాన్ని వీడి గురువారం ఢాకా చేరుకున్నారు.

7

రష్యాలో సాఫ్ట్‌వేర్ జాబ్ వదిలి.. స్వీపర్లుగా

పెద్ద కంపెనీల్లో ఉద్యోగం మానేసి రష్యాలో మన దేశానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు చీపురు చేతబట్టి రోడ్లు ఊడుస్తున్నారు. అదేంటని ఆశ్చర్యపోతున్నారా? మీరు చదివింది నిజమే.

7

దేశ వ్యాప్తంగా గిగ్‌వర్కర్ల సమ్మె

గిగ్‌వర్కర్లు గురువారం సమ్మెకు దిగారు. ఈకామర్స్, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, జెప్టో, బ్లింకిట్, స్విగ్గీ, దాని అనుబంధ సంస్థ ఇన్‌స్టామార్ట్, జొమాటో యాప్ సేవల్లో తీవ్ర అంతరాయం నెలకొన్నది.

7

రాజకీయం

ఒడిశాలో భారీ ఎన్‌కౌంటర్

మొదటిపేజీ తరువాయి

కేంద్ర కమిటీ సభ్యుడు అని, హనుమంతుపై రూ.1.10 కోట్ల రివార్డు ఉందని చెప్పారు. కొన్ని రోజుల క్రితం ప్రభుత్వం రివార్డు ప్రకటించిందని వెల్లడించారు. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నాయకులలో ఒకరైన హనుమంతు నేడు హతమయ్యాడని చెప్పారు. గణేశ్ గత 40 ఏళ్లుగా మావోయిస్టు ఉద్యమంలో ఉన్నారు. వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన మావోయిస్టుల బలం పెంచడం కోసం ఎంతో కృషిచేశారు. హనుమంతు చండూరులో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ నల్గొండలో చేస్తూ రాడికల్ యూనియన్‌లో పనిచేశారు. 45 ఏళ్ల క్రితం ఏచూరి శ్రీనివాస్ అనే ఏబీవీపీ నాయకుని హత్యలో ఆయన కీలకపాత్ర పోషించినట్లు చెబుతారు. అనంతరం అజ్ఞాతంలోకి వెళ్లిన ఆయన నక్సలైట్ ఉద్యమంలో చేరారు. మండల కమిటీ నుంచి జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి నేతగా ఎదిగి మూడు రాష్ట్రాలకు కేంద్ర కమిటీ సభ్యుడిగా పనిచేశారు. ఇటీవలి కాలంగా ఆరోగ్యం బాగాలేక ఇబ్బంది పడుతున్నారని సమాచారం. హనుమంతు తండ్రి సీపీఎం పార్టీలో పనిచేశారు. దీంతో హనుమంత్ చదువుకునే రోజుల్లోనే ఉద్యమం వైపు వెళ్లారు. కాగా, గతంలో ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబాద్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో పాక హనుమంతు మృతి చెందినట్లు ఛత్తీస్‌గఢ్ పోలీస్ అధికారులు వెల్లడించడం గమనార్హం. ఆ సమయంలో గ్రామంలో విషాదం నెలకొంది. అయితే నాడు చనిపోయింది హనుమంతు కాదని కుటుంబ సభ్యులు , పార్టీ నాయకత్వం ప్రకటించింది. కాగా తాజాగా ఆయన ఒడిస్సాలో మరణించినట్లు పోలీసులు దృవీకరించారు.

ఇక మావోయిస్టులతో చర్చలు జరపం

- ఒడిశా ఎన్‌కౌంటర్‌కీలక విజయం
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి సిద్ధం
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడి



ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 25: 2026 మార్చి 31 నాటికి దేశం మావోయిస్టు రహితంగా మారుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. మావోయిస్టులతో ఇక ప్రభుత్వం ఎటువంటి చర్చలు జరపదని, ఆయుధాలు వదిలేసి లొంగిపోయేందుకు ముందుకు వస్తే స్వాగతిస్తామని తెలిపారు. ఆ విధంగా లొంగిపోయిన వారందరికీ ప్రభుత్వం నుంచి అందాల్సిన వివిధ ప్రయోజనాలు అందిస్తామని పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పోస్ట్ చేశారు. ఒడిశా ఎన్‌కౌంటర్‌ను నక్సల్ రహిత భారతదేశం దిశగా ఒక ముఖ్యమైన మైలురాయిగా వర్ణించారు. "ఒడిశాలోని కంధమాల్‌లో జరిగిన ఒక భారీ ఆపరేషన్‌లో, కేంద్ర కమిటీ సభ్యుడు గణేశ్ ఉయికేతో సహా 6 మంది నక్సలైట్లు ఇప్పటివరకు హతమయ్యారు. ఈ కీలక విజయంతో, ఒడిశా నక్సలిజం నుండి పూర్తిగా విముక్తి పొందడానికి అంచున నిలిచింది. 2026 మార్చి 31వ తేదీలోపు నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించడానికి మేం కట్టుబడి ఉన్నాం" అని అమిత్ షా పోస్ట్ చేశారు. మావోయిస్టులు తమతో చర్చలు జరపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారని, ఇప్పుడు వారితో మాట్లాడడానికి ఏముందని ప్రశ్నించారు. బస్తర్ అంతటా ఉన్న మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో ఆయుధాలతో శాంతికి విఘాతం కలిగించే వారికి భద్రతా దళాలు తగిన సమాధానం ఇస్తాయని మావోయిస్టులను హెచ్చరించారు. అయితే మార్చి 31, 2026 తర్వాత ఇటువంటి గ్రామాల అభివృద్ధిని మావోయిస్టులు అడ్డుకోలేరని అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ అభివృద్ధి కోసం రూ.4లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించిందని, భవిష్యత్తులో మరిన్ని నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. దేశంలో నక్సలిజం సమస్య ఎందుకు తలెత్తిందని, వారికి సైద్ధాంతిక, ఆర్థిక, చట్టపరమైన మద్దతును ఎవరు అందిస్తున్నారని ప్రశ్నించారు.

12 జోన్లు, 60 సర్కిళ్లు

మొదటిపేజీ తరువాయి

ఏకంగా 2,053 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. ప్రస్తుతం ఆరు జోన్లు, 30 సర్కిళ్ల ద్వారా సాగుతున్న పరిపాలన ఇంత భారీ విస్తీర్ణానికి సరిపోవడం లేదని అధికారులు గుర్తించారు. ముఖ్యంగా ఎల్బీనగర్ జోనల్ కార్యాలయం నుంచి పెద్దఅంబర్‌పేట్ వంటి సుదూర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, వీధిలైట్లు, రహదారుల పనులను పర్యవేక్షించడం జోనల్ కమిషనర్లకు సవాలుగా మారింది. ఈ సమస్యను అధిగమించడానికి ప్రస్తుతమున్న 6 జోన్లను 12కు, 30 సర్కిళ్లను 60కి పెంచాలని నిర్ణయించారు. దీనివల్ల ప్రతి జోన్ పరిధిలో సగటున ఐదు సర్కిళ్లు ఉండి, పర్యవేక్షణ మరింత సులభతరం కానుంది.వచ్చే ఏడాది జనవరి నుంచి దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియ ప్రారంభం కానుంది. ఒకసారి జనగణన మొదలైతే, తదుపరి రెండేళ్ల వరకు డివిజన్ల మార్పులు లేదా పునర్విభజన చేపట్టడం సాధ్యపడదు. ఈ సాంకేతిక ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని.. ప్రభుత్వం అత్యంత వేగంగా శివారు ప్రాంతాల విలీనాన్ని పూర్తి చేసి పునర్విభజన ప్రక్రియను కొలిక్కి తెచ్చింది. ఈ వ్యవస్థీకరణ కేవలం సౌలభ్యం కోసం మాత్రమే కాకుండా.. భవిష్యత్తులో జీహెచ్‌ఎంసీని మూడు స్వతంత్ర మహానగరపాలక సంస్థలుగా విభజించాలనే ప్రభుత్వ దీర్ఘకాలిక వ్యూహానికి పునాదిగా కనిపిస్తోంది.

మూడు కార్పోరేషన్లుగా..

ప్రభుత్వ ప్రాథమిక ఆలోచన ప్రకారం.. మూసీ నదిని సరిహద్దుగా తీసుకుని నగర విభజన జరగనుంది. మూసీకి దక్షిణాన ఉన్న ప్రాంతాలన్నింటినీ కలిపి ఒక కార్పొరేషన్‌గా దీనికి 'జీహెచ్‌ఎంసీ' పేరునే కొనసాగించే అవకాశం ఉంది. ఉత్తరాన ఉన్న ప్రాంతాలను సికింద్రాబాద్, సైబరాబాద్ పేరుతో మరో రెండు కార్పొరేషన్లుగా ఏర్పాటు చేసే దిశగా కసరత్తు సాగుతోంది. ఈ చారిత్రాత్మక మార్పు ద్వారా నగరంలోని అన్ని ప్రాంతాలకు సమానంగా నిధులు కేటాయించడం, ట్రాఫిక్, వ్యర్థాల నిర్వహణ వంటి సమస్యలను స్థానికంగానే పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం. ఈ పునర్ వ్యవస్థీకరణ పూర్తయితే.. హైదరాబాద్ మహానగరం పాలనాపరంగా సరికొత్త రూపురేఖలను సంతరించుకోనుంది.

అర్ధరాత్రి వరకు లిక్కర్

విక్రయదారులు, వినియోగదారులకు ఊరటనిచ్చేలా డిసెంబర్ 31న మద్యం విక్రయాల వేళలను పొడిగించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేక జీవోను జారీ చేసింది. ఎక్సైజ్ శాఖ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలోని అన్ని వైన్ షాపులు డిసెంబర్ 31న అర్ధరాత్రి 12:00 గంటల వరకు తెరిచి ఉంచనున్నారు. ఇక బార్లు, క్లబ్బులు, టూరిజం ప్రాంతాల్లోని హోటళ్లు, అలాగే ప్రత్యేకంగా అనుమతి పొందిన ఈవెంట్ నిర్వాహకులకు రాత్రి ఒంటి గంట వరకు పని చేయడానికి అనుమతి ఉంటుంది. మరోవైపు న్యూ ఇయర్ వేళ హద్దుదాటి ప్రవర్తించే వారిపై పోలీస్ శాఖ నిఘా పెట్టనుంది. డిసెంబర్ 27వ తేదీ నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ కూడా ప్రత్యేక తనిఖీలు, డ్రైవ్స్ చేపట్టనుంది. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుండి అక్రమంగా వచ్చే మద్యం, నిషేధిత మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా ఎక్కడిక్కడ సోదాలు చేపట్టనుంది. ముఖ్యంగా డిసెంబర్ 30, 31 తేదీలలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది. సిటీలోనే కాకుండా చెక్ పోస్టుల వద్ద కూడా నిఘా పెంచనుంది. ఇక నూతన సంవత్సర వేడుకల పేరుతో రోడ్లపై హంగామా సృష్టిస్తూ, హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ పోలీసులు హెచ్చరించారు. తాగి వాహనాలు నడిపే వారిపై బుధవారం నుంచి న్యూ ఇయర్ రోజు వరకు నగరవ్యాప్తంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు నగర సీపీ సజ్జనార్ వివరాలను వెల్లడించారు. క్రిస్మస్, వైకుంఠ ఏకాదశి, నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. హాట్ స్పాట్లు, గతంలో నేరాలు జరిగిన ప్రాంతాల్లో సిబ్బందిని మోహరించాలని, పాత నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. డిసెంబరు 31 రాత్రి నగర వ్యాప్తంగా 100 ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతామని సీపీ తెలిపారు. ఇందుకోసం 7 ప్లాటూన్ల అదనపు బలగాలను రంగంలోకి దించుతున్నామన్నారు. కొత్త సంవత్సరం జోష్‌లో మోతాదు మించి తాగి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడితే వాహన సీజ్‌తో పాటు రూ.10వేల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

పెన్ డ్రైవ్‌లో ఏముంది?

మొదటిపేజీ తరువాయి

సిద్ధమవుతున్నట్లు విస్తృత ప్రచారం జరుగుతోంది. ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్న సమయంలో ప్రభాకర్ రావు అత్యంత రహస్యంగా సేకరించిన సమాచారాన్ని ఈ పెన్‌డ్రైవ్‌లో భద్రపరిచినట్లు సిట్ గుర్తించింది. ఇందులో ఉన్న వివరాలు చూసి అధికారులే విస్తుపోతున్నారు. కేవలం ఫోన్ నంబర్లు మాత్రమే కాకుండా, హైకోర్టు జడ్జీలు, ప్రముఖ జర్నలిస్టులు, కీలక రాజకీయ నాయకులు, బడా వ్యాపారవేత్తల పూర్తి ప్రొఫైల్స్ ఇందులో ఉన్నట్లు సమాచారం. వందల సంఖ్యలో ట్యాప్ చేసిన ఫోన్ నంబర్లు, వారి వ్యక్తిగత సమాచారం ఇందులో నిక్షిప్తమై ఉంది. ప్రస్తుతం సిట్ కస్టడీలో ఉన్న మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావును ఈ పెన్‌డ్రైవ్ ఆధారంగానే అధికారులు ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. ఎల్లుండి వరకు ఆయన్ను విచారించనున్న నేపథ్యంలో, ఈ పెన్‌డ్రైవ్‌లోని డేటాను ఎవరి ఆదేశాల మేరకు సేకరించారు.? ఎవరికి చేరవేశారు.? అన్న కోణంలో లోతుగా ఆరా తీస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను, మరో మాజీ ఎస్ఐబీ చీఫ్‌ను విచారించిన సిట్.. ఇప్పుడు ప్రభాకర్ రావు ఇచ్చే సమాచారంతో కేసుకు ముగింపు పలికే దిశగా వెళ్తోంది. అసలు ఈ ట్యాపింగ్ పర్వం ఎవరి ప్రయోజనాల కోసం జరిగింది.? అన్నదే ఇప్పుడు సిట్ ముందున్న ప్రధాన ప్రశ్న. ప్రభుత్వంలోని పెద్దల ఆదేశాలు లేనిదే ఇంతటి భారీ నిఘా యంత్రాంగం నడవడం అసాధ్యమని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుల పాత్రపై అనుమానాలు బలపడుతున్నాయి. పెన్‌డ్రైవ్‌లో ఉన్న సమాచారం కనుక నేరుగా రాజకీయ పెద్దలకు లింక్ అయితే, వారికి నోటీసులు ఇవ్వడం ఖాయమని పోలీసు వర్గాల టాక్. ఈ పెన్ డ్రైవ్ వ్యవహారం బయటకు రావడంతో.. అందులో ఎవరెవరి పేర్లు ఉన్నాయన్నది ఇప్పుడు రాజకీయ, మీడియా, న్యాయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ట్యాపింగ్ కేసులో ఇన్నాళ్లూ దొరకని కీలక లింక్ ఈ పెన్ డ్రైవ్ రూపంలో దొరికిందని, ఇదే ఈ కేసులో గేమ్ ఛేంజర్ కాబోతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. త్వరలోనే ఈ కేసులో మరిన్ని సంచలన అరెస్టులు లేదా నోటీసులు వెలువడే అవకాశం ఉంది.

ఆ సేల్ డీడ్ల రద్దు చెల్లదు: హైకోర్టు



ప్రతిపక్షం ప్రతినిధి, కరీంనగర్, డిసెంబర్ 25: కరీంనగర్ జిల్లా కొత్తపల్లి సర్వే నంబర్ 197, 198లోని భూముల సేల్ డీడ్‌లను జిల్లా కలెక్టర్ రద్దు చేయడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. పిటిషనర్లకు నోటీసులు జారీ చేయకుండా వ్యవహరించిన కలెక్టర్ చర్యలను రద్దు చేసింది. గత మేలో 453 సేల్ డీడ్‌లను కలెక్టర్ రద్దు చేస్తూ వెలువరించిన ఉత్తర్వులను హైకోర్టు రద్దుచేసింది. కలెక్టర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన సుమారు 35 పిటిషన్లపై జస్టిస్ కే లక్ష్మణ్ ఇటీవల తీర్పు చెప్పారు. ప్రభుత్వ భూములను ఆక్రమించారంటూ లోకాయుక్తకు వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో తెలంగాణ రిజిస్ట్రేషన్ నియమాలు 2016లోని రూల్ 243 కింద కలెక్టర్ ఆ సేల్‌డీడ్‌లు రద్దు చేశారు. ఈ చర్యను హనుమాజీపల్లికి చెందిన లింగాల పద్మ, ఇతరులు 35 పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషనర్లకు నోటీసులు జారీ చేయకుండా, వాదనలు వినకుండా కలెక్టర్ సేల్ డీడ్స్‌ను రద్దు చేశారని తప్పుబట్టారు. భూములను సెక్షన్ 22ఏ పరిధిలోకి తీసుకొనిరాలేరంటూ కలెక్టర్ ఉత్తర్వులు రద్దు చేశారు. భూముల వివాదం 1975 నుంచి కొనసాగుతున్నది. షేక్ సలేహ్, ఇతరులు సీలింగ్ చట్టం కింద కొత్తపల్లి, రేకుర్తి లోని పలు సర్వే నంబర్లలోని భూములను మిగులు భూములుగా ప్రకటించారు. అది మోసపూరిత ప్రకటన అని 1998లో అధికారులకు ఒకరు ఫిర్యాదు చేశారు. దీంతో వాటిని రిజిస్ట్రేషన్ చేయరాదని ఆర్డీవో ఉన్నతాధికారికి 1996లో లేఖ రాశారు. దీంతో ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని 2017లో లోకాయుక్త ఉత్తర్వులిచ్చారు. దీంతో అవి ప్రభుత్వ భూములని కలెక్టర్ రిజిస్ట్రేషన్లను రద్దు చేశారు. కలెక్టర్ నిర్ణయాన్ని పిటిషనర్లు సవాల్ చేశారు. పిటిషనర్లకు తమ వాదనలు చెప్పుకునే అవకాశం ఇవ్వకుండా రిజిస్ట్రేషన్లను రద్దు చేయడం చెల్లదని హైకోర్టు తేల్చింది.

కర్ణాటకలో ఘోర బస్సు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి

నుంచి బెంగళూరు వైపు వెళుతున్న ఓ లారీ అదుపు తప్పి డీవైడర్‌ని దాటింది. ఆ వెంటనే, అటుగా వస్తున్న ప్రైవేట్ బస్సును బలంగా ఢీకొట్టింది. సరిగ్గా డీజిల్ ట్యాంక్‌ని లారీ ఢీకొట్టడంతో బస్సులో మంటలు చెలరేగాయి. క్షణాల వ్యవధిలో మొత్తం బస్సుకు మంటలు వ్యాపించాయి. ప్రమాదం సమయంలో ఈ ప్రైవేట్ బస్సు బెంగళూరు నుంచి శివమొగ్గవైపు వెళుతోంది. ప్రమాదం సమయంలో బస్సులో 30కిపైగా మంది ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. చాలా మంది నిద్రపోతూ ఉండటంతో బస్సుకు మంటలు అంటుకున్నట్టు వెంటనే తెలియలేదు. ఫలితంగా అనేక మంది సజీవదహనం అయ్యారు. మంటలు చెలరేగుతున్నట్టు అర్థం చేసుకున్న కొందరు మాత్రమే బస్సు నుంచి బయటపడేందుకు ప్రయత్నించారు. వీరికి తీవ్ర గాయాలు అయ్యాయి. కర్ణాటక బస్సు ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు 17 మృతదేహాలను వెలికితీశారు. క్షతగాత్రులను సిరా ఆసుపత్రికి తరలించారు. హిరియూరులోని ఆసుపత్రిలో ఇంకొందరికి చికిత్స జరుగుతోంది. 'లారీ డ్రైవర్ నిర్లక్షం వల్ల ఈ ప్రమాదం జరిగినట్టు ప్రాథమిక దర్యాప్తు బట్టి తెలుస్తోందని పోలీసులు తెలిపారు. బలంగా ఢీకొట్టడంతో బస్సులో మంటలు చెలరేగాయి. సహాయక చర్యలు మరింత కష్టంగా మారాయన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, బస్సు ప్రమాదంపై దర్యాప్తు చేపడతామన్నారు. ఆ తర్వాతే అసలేం జరిగింది? అన్నది క్లారిటీగా తెలుస్తుందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ సంభవించింది. ప్రస్తుతం శిథిలాల తొలగింపు ప్రక్రియను కొనసాగుతోంది.

అసెంబ్లీకి కేసీఆర్ వస్తారా?

మొదటిపేజీ తరువాయి

కేసీఆర్ ప్లాన్ చేస్తున్నారు. అందుకే నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌లో సభలకు రెడీ అవుతున్నారు. ఈ మీటింగ్‌లకు తాను స్వయంగా హజరవుతానని, ఇక నుంచి ఐయామ్ ఆన్ ది ఫీల్డ్‌అంటూ కేసీఆర్ చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేతగాని తనం వల్లే తెలంగాణకు న్యాయంగా రావాల్సిన నీటి వాటా దక్కడం లేదన్న వాదనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేసీఆర్‌అనుకుంటున్నారు. అయితే ఇంతలోపే అసెంబ్లీ సమావేశాలు పెట్టి, కేసీఆర్ సభకు రమ్మని సీఎం రేవంత్‌సవాల్ చేస్తున్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వెళ్తారా? లేదా? అన్నది అనుమానమే. ఎందుకంటే కేసీఆర్ ప్రతిపక్షంలోకి వచ్చినప్పటి నుంచి ఏ చర్చలో పాల్గొన్న సందర్భాలు లేవు. తెలంగాణ భవన్‌లో లేకపోతే ఫాంహౌస్‌లో నేతలను ఉద్దేశించి మాట్లాడటమో, ప్రెస్‌మీట్ పెట్టడమో తప్ప.. అసెంబ్లీ వేదికగా అపోజిషన్ లీడర్‌గా ఏ అంశాన్నిప్రస్తావించలేదు కేసీఆర్. ఇదే అస్త్రంగా మల్చుకుని కేసీఆర్‌ను సభకు రప్పించేందుకు మరోసారి గేమ్ స్టార్ట్ చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. కేసీఆర్ అసెంబ్లీకి రావాలని ఎన్నిసార్లు సవాల్ చేసినా, రేవంత్ మాటలను కేసీఆర్ పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించలేదు. కేటీఆర్, హరీశ్‌తోనే కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల ప్రశ్నలకు సమాధానం చెప్పించారు కేసీఆర్. అయితే రేవంత్ మొత్తం కేసీఆర్ లేవనెత్తిన కృష్ణా జలాల అంశంలో ఆయన చేతనే చేత సమాధానం చెప్పించాలనే ఎత్తుగడ వేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే టాపిక్ ఏదైనా చర్చకు రెడీ అంటూ రేవంత్ సవాల్ విసురుతున్నారని అంటున్నారు. ఒకవేళ రేవంత్ సవాల్‌ను స్వీకరించి కేసీఆర్ సభకు వస్తే, ముందు ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని చర్చకు పెట్టే ప్లాన్ చేస్తున్నారట. కృష్ణా వాటర్ విషయంలో కేసీఆర్ కేంద్రం దగ్గర ఒప్పుకున్న అంశాలను ఎక్స్‌పోజ్ చేస్తూ, తెలంగాణకు నీటి వాటాలు దక్కకుండా చేశారని వివరించాలని అనుకుంటున్నారట. మరి రేవంత్ సవాల్‌ను స్వీకరించి కేసీఆర్ అసెంబ్లీకి వస్తారా లేక ఎప్పటిలాగే లైట్ తీసుకుంటారా అనేది వేచి చూడాలి.

వాజ్‌పేయిది దూరదృష్టి గల నాయకత్వం

- సుస్థిర పరిపాలన, వారసత్వం దేశ ప్రజలకు స్ఫూర్తి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 25: మాజీ ప్రధాని, భారత రత్న అటల్ బిహారీ వాజ్ పేయి జయంతిని పురస్కరించుకొని 'అటల్ స్మృతి వర్ష్' సందర్భంగా, ఎల్‌బీ నగర్‌లో వాజ్ పేయి విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూదేశానికి వాజ్ పేయి అందించిన అపూర్వ సేవలు, ఆయన దూరదృష్టిగల నాయకత్వం, సుస్థిర పరిపాలన, చిరస్థాయి వారసత్వం తరతరాలుగా దేశ ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయన్నారు. అటల్ బిహారీ వాజ్ పేయి జయంతిని పురస్కరించుకొని, అటల్ స్మృతి వర్ష్ సందర్భంగా ఎల్బీనగర్‌లో వాజ్పేయి విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా అటల్ బిహారీ వాజ్ పేయి జయంతిని 'గుడ్ గవర్నెన్స్ డే'గా జరుపుకుంటున్నామని అన్నారు. 1980లో భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించినప్పుడు, పార్టీకి తొలి జాతీయ అధ్యక్షుడిగా వాజ్ పేయి బాధ్యతలు చేపట్టారని అన్నారు. ఆ సమయంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ యువమోర్చా అధ్యక్షుడిగా ఇంద్రసేనా రెడ్డి సేవలందించారని తెలిపారు. ఆ రోజుల్లో తాను కూడా యువమోర్చాలో కార్యదర్శిగా పనిచేశానని తెలిపారు. వాజ్ పేయితో కలిసి పనిచేసే అవకాశం దక్కడం ఒక అదృష్టం. అలాగే, నేడు ఆయనను స్మరించుకోవడం మరో అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. విలువలతో కూడిన రాజకీయాలకు అటల్ బిహారీ వాజ్ పేయి ప్రతీక అని, కానీ నేడు తెలంగాణ రాజకీయాల్లో ఆ సంస్కృతి కనిపించడం లేదన్నారు. దురదృష్టవశాత్తు నేటి రాజకీయాల్లో ఆ విలువలు క్రమంగా కనుమరుగవుతున్నాయన్నారు. ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో పార్లమెంటులో కేవలం ఒక్క ఓటుతో ప్రభుత్వం కోల్పోతానని తెలిసినా, ఇతర పార్టీల ఎంపీలు మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా, నైతిక విలువలకు కట్టుబడి అధికారాన్ని వదులుకున్న మహానాయకుడు అటల్ బిహారీ వాజ్ పేయి అని అన్నారు. ఆయన చూపిన పాలనా మార్గమే నేడు ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో కొనసాగుతోందన్నారు.

“

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజలు కోటి సంతకాలు చేసినా సీఎం లెక్కలేనితనంతో వ్యవహరిస్తున్నారు. పేదలకు మేలు చేసేలా జగన్ వైద్యరంగాన్ని అభివృద్ధి చేశారు. వాటిని నీరుగార్చి ప్రైవేటుతో మేలుచేస్తానంటే ఎవరూ నమ్మరు. ఎన్నికకో పార్టీతో పొత్తు పెట్టుకొని చిల్లర రాజకీయాలు చేస్తూ నావి హుందా పాలిటిక్స్ అని చంద్రబాబు అనడం హాస్యాస్పదం.

- వైసీపీ నేత కాకాణి గోవర్ధన్

రాష్ట్రీయం

సరికొత్త ఎలివేటెడ్ కారిడార్లు.. హెచ్ఎండీఏ ప్రతిపాదనలు

- బంజారాహిల్స్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు పది కిలోమీటర్ల మేర ఆరు వరుసల ఎక్స్‌ప్రెస్ వే

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 25: హైదరాబాద్ నగరవాసుల ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు హెచ్ఎండీఏ సరికొత్త ఎలివేటెడ్ కారిడార్లను ప్రతిపాదించింది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 నుండి గచ్చిబౌలి శిల్పా లేఅవుట్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు వరకు పది కిలోమీటర్ల మేర ఆరు వరుసల ఎక్స్‌ప్రెస్ వే నిర్మించనున్నారు. అలాగే, షేక్‌పేట్ నాలా నుండి గండిపేట సీబీఐటీ వరకు 200 అడుగుల రహదారి విస్తరణతో పాటు భవిష్యత్తులో ఎలివేటెడ్ కారిడార్‌ను డిజైన్ చేస్తున్నారు. ఇప్పటికే ప్యారడైజ్ నుండి శామీర్‌పేట వరకు 18.5 కిలోమీటర్ల కారిడార్ పనులు ఖరారయ్యాయి. ఈ ప్రాజెక్టులు పూర్తయితే నగరం నడిబొడ్డు నుండి ఔటర్ రింగ్ రోడ్డుకు సిగ్నల్ లేకుండా అతి తక్కువ సమయంలో చేరుకోవచ్చు.హైదరాబాద్ నగరం శరవేగంగా విస్తరిస్తున్న తరుణంలో.. కోర్ సిటీ నుండి ఔటర్ రింగ్ రోడ్డుకు చేరుకోవడం వాహనదారులకు పెద్ద సవాలుగా మారింది. ప్రస్తుతం ఉన్న రహదారులు పెరుగుతున్న వాహనాల రద్దీని తట్టుకోలేకపోతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ భారీ ఎలివేటెడ్ కారిడార్లు , ఎక్స్‌ప్రెస్ వేల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నగరం నడిబొడ్డు నుండి ఐటీ కారిడార్‌కు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రభుత్వం ఒక ప్రతిష్టాత్మక ప్రాజెక్టును సిద్ధం చేసింది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 నుండి గచ్చిబౌలి శిల్పా లేఅవుట్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్డుకు వెళ్లేలా ఆరు వరుసల ఎక్స్‌ప్రెస్ వే నిర్మించనున్నారు. ఈ రహదారి ఫిలింనగర్, జడ్జెస్ కాలనీ, దుర్గం చెరువు పక్క నుండి టిహబ్ మీదుగా సాగుతుంది. సుమారు 10 కిలోమీటర్ల పొడవుండే ఈ మార్గంలో 7 కిలోమీటర్ల మేర అత్యాధునిక స్టీల్ బ్రిడ్జి నిర్మిస్తారు. ఎక్కడా సిగ్నల్ లేకుండా నేరుగా ఔటర్ చేరుకునేలా దీనిని రూపొందిస్తున్నారు. మెహదీపట్నం, టోలిచౌకి నుండి గండిపేట వైపు వెళ్లే వాహనాల కోసం ప్రత్యామ్నాయ మార్గాన్ని అభివృద్ధి చేస్తున్నారు. షేక్‌పేట్ నాలా నుండి మణికొండ పైప్‌లైన్ రోడ్డు మీదుగా గండిపేటలోని సీబీఐటీ కాలేజీ వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును 200 అడుగులకు విస్తరించనున్నారు. ఈ వెడల్పైన రహదారిపై భవిష్యత్తులో 7 కిలోమీటర్ల పొడవైన ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేలా డిజైన్ చేస్తున్నారు. ఇది పూర్తయితే పాత ముంబై హైవేపై ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది.సికింద్రాబాద్ ప్యారడైజ్ నుండి శామీర్‌పేట ఔటర్ జంక్షన్ వరకు 18.5 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. సుమారు 2,232 కోట్ల రూపాయలతో చేపట్టే ఈ ప్రాజెక్టులో 11.65 కిలోమీటర్ల ఆరు వరుసల ఫ్లైఓవర్ ఉంటుంది. హకీంపేట వద్ద భూగర్భ టన్నెల్ నిర్మాణం ఈ ప్రాజెక్టులో మరో ప్రత్యేకత. ఈ కారిడార్ పూర్తయితే కరీంనగర్, నిజామాబాద్, సిద్దిపేట వైపు నుండి వచ్చే వాహనాలు నగరం లోపలికి వేగంగా రావచ్చు. దీనిని 24 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.హైదరాబాద్‌లో ఈ ఎలివేటెడ్ కారిడార్లు ప్రయాణ సమయాన్ని తగ్గించడమే కాకుండా.. నగర ఆర్థిక వ్యవస్థపై కూడా సానుకూల ప్రభావం చూపుతాయి. గచ్చిబౌలి, కొండాపూర్ వంటి ప్రాంతాల్లో పని చేసే లక్షలాది మంది ఉద్యోగులకు ఈ కొత్త కనెక్టివిటీ రోడ్లు గొప్ప ఉపశమనాన్ని ఇస్తాయి. ట్రాఫిక్ జాంలు తగ్గడం వల్ల ఇంధన వినియోగం తగ్గి.. నగరంలో వాయు కాలుష్యం తగ్గుముఖం పడుతుంది. మణికొండ, గండిపేట, శామీర్‌పేట పరిసర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటం వల్ల ఆయా ప్రాంతాల్లో నివాస గృహాలకు డిమాండ్ పెరుగుతుంది. మెట్రో రైలు, ఈ కొత్త ఎలివేటెడ్ కారిడార్ల మధ్య అనుసంధానం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నగరం నలుమూలల నుండి ఔటర్ రింగ్ రోడ్డుకు గ్రీన్ ఛానెల్ కనెక్టివిటీని ఏర్పాటు చేయడం ద్వారా హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలున్న నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం.

కేసీఆర్ వల్లే నీటి కష్టాలు

- చంద్రబాబుతో కుమ్మక్కై తెలంగాణకు ద్రోహం చేశారు
- రేవంత్ రెడ్డి మాట్లాడిన భాష బాగాలేదు
- కేంద్ర మంత్రి బండి సంజయ్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 25: కృష్ణా జలాల విషయంలో చంద్రబాబుతో కుమ్మక్కై తెలంగాణకు కేసీఆర్ ద్రోహం చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఆయన నుంచి ముడుపులు అందుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్‌కు సానుభూతి రావాలని చెప్పి భూతులు తిడుతున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి మాట్లాడిన భాష బాగాలేదని అంటున్నారు. మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ లో మాట్లాడిన బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. కోస్గి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్ తెలంగాణలో దుమారాన్ని రేపుతున్నాయి. ఆయన కేసీఆర్, కేసీఆర్ కుటుంబంపై వాడిన భాష అభ్యంతరకరంగా ఉందని అన్ని పార్టీల నేతలు కామెంట్స్ చేస్తున్నారు. ముఖ్యంగా బీజేపీ నేతలు తీవ్రంగా తప్పుపడుతున్నారు. బండి సంజయ్ మాట్లాడుత... రేవంత్ రెడ్డి భాష సరిగా లేదని అన్నారు. గతంలో కేసీఆర్ కూడా ఇలాంటి భాష మాట్లాడి వ్యతిరేకత తెచ్చుకున్నారని అన్నారు. అప్పట్లో కూడా ఆయన భాషపై తాను అభ్యంతరం వ్యక్తం చేశానని అన్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా భాషను సరి చేసుకోవాలని సూచించారు. కృష్ణా జలాలపై మాట్లాడే అర్హత కేసీఆర్‌కు లేదన్నారు బండి సంజయ్. తెలంగాణకు కృష్ణా జలాల విషయంలో అన్యాయం జరిగిందని కేసీఆర్ వల్లే అన్నారు. చంద్రబాబుతో కలిసి తీరని ద్రోహం చేశారని అన్నారు. 570 టీఎంసీలు రావాల్సి ఉంటే 299 టీఎంసీలకే అంగీకరించి గొంతుకోశారని అన్నారు. దీని కోసం చంద్రబాబు నుంచి ముడుపు తీసుకున్నారని మండిపడ్డారు. ఇప్పుడు మరోసారి ప్రజలను మోసం చేయడానికి కృష్ణా జలాలను ఎంచుకున్నారని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ పరిస్థితి రోజు రోజుకు దిగజారిపోతుందని బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. దీంతో నేతలంతా తీవ్ర నిరాశలో ఉన్నారని అన్నారు. పడిపోతున్న తన పార్టీని, బీఆర్ఎస్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రేవంత్ రెడ్డి బూతులు తిడుతున్నారని అన్నారు. దీని వల్ల కేసీఆర్‌కు సానుభూతి వస్తుందని అన్నారు. అందుకే రెండు పార్టీలు కుమ్మక్కై ఇలాంటి నాటకాలు ఆడుతున్నాయని అన్నారు.

హసన్‌పర్తిలో రోడ్డు ప్రమాదం

ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్ 25: హన్మకొండ జిల్లా,అనంతసాగర్ క్రాస్‌రోడ్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో చింతలపల్లికి చెందిన చందుపట్ల విద్యాసాగర్ మృతి చెందాడు. హనుమకొండకు పాల ప్యాకెట్లు సరఫరా చేసేందుకు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి పెట్రోల్ ట్యాంకర్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన విద్యాసాగర్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ప్రమాదంతో రోడ్డుపై పాలలో రక్తం కలిసిపోయి హృదయ విదారక దృశ్యం నెలకొంది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

మీపార్టీని బొంద పెడతాం

- సీఎం అహంకారంతో మాట్లాడుతున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 25: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి అహంకారంతో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోస్గిలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందిస్తూ, 2028లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమని అన్నారు. నీటి ద్రోహంపై సమాధానం చెప్పలేక ఇష్టారీతిన మాట్లాడుతున్నారని విమర్శించారు. నదీ జలాల హక్కులను కాపాడటం చేతకాని అసమర్థుడు అహంకారంతో మాట్లాడుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాలమూరు ప్రాజెక్టు గొంతుకోసి సొంత జిల్లానే మోసం చేస్తున్నాడని ఆరోపించారు. అది చాలదన్నట్లుగా కేసీఆర్‌పై ఏది పడితే అది మాట్లాడుతున్నారని అన్నారు. సభ్యత, సంస్కారం లేని నీచమైన రేవంత్ రెడ్డి ప్రవర్తనను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు.ప్రజలు ఛీకొడుతున్నా ఇంకా మారవా అని ఎద్దేవా చేశారు. శాసనసభతో పాటు జనసభలోనూ కాంగ్రెస్ పార్టీ జలద్రోహాన్ని ఎండగడతామని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో వందేళ్ల వరకు కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సందర్భం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

రేవంత్ రెడ్డిని చెట్టుకు కట్టేసి కొరడా కొట్టి తొండలు జోరించాలి

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు
- విద్యార్థుల సమస్యల్ని పరిష్కరించాలి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 25: రేవంత్ రెడ్డిని చెట్టుకు కట్టేసి కొరడా దెబ్బలు కొట్టి తొండలు జోరించిన తక్కువే అని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు.సిద్దిపేట జిల్లా కేంద్రంలోని నాసార్‌పుర పిల్లర్‌బెడ్ సమీపంలో గల అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహించిన బ్లాంకెట్ల పంపిణీ కార్యక్రమంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న గుడ్లు, బియ్యం, భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించి, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యం వల్ల అన్నం మెత్తగా ముద్దలుగా అవుతుందని విద్యార్థులు తమకు చెప్పారని అన్నారు. చలికాలంలో పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అందుకే మానవతా దృష్టితో బ్లాంకెట్లు పంపిణీ చేశామని తెలిపారు. ఐదు నెలలుగా విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు విడుదల కావడం లేదని, అలాగే మెస్ బిల్లులు కూడా ఐదు నెలలుగా రావడం లేదని ఆరోపించారు. దీంతో హాస్టల్ నిర్వాహకులు సొంత డబ్బులతో నిర్వహణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.విద్యాశాఖ మంత్రి హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి ఉండి కూడా అనాథ విద్యార్థులకు సరైన భోజనం అందించలేకపోతున్నారని హరీష్ రావు తీవ్ర విమర్శలు చేశారు. ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి మళ్లీ గెలుస్తానని శపథాలు చేస్తున్నారని, కానీ ఆయన రాజకీయ జీవితం కమిషన్లు, చిల్లర మాటలు, పార్టీలు మారడం, సీట్లు కొనుగోలు చేయడమేనని ఆరోపించారు.తెలంగాణను సాధించిన పోరాట యోధుడు కేసీఆర్ అని, కేసీఆర్ లేకుంటే తెలంగాణే లేదని హరీష్ రావు స్పష్టం చేశారు. తండ్రి స్థానంలో ఉన్న కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హెచ్చరించారు. ఫార్మసిటీని తమ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే అప్పట్లో దాన్ని తీవ్రంగా ఖండించిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు అదే ప్రాంతాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మార్చుతున్నారని విమర్శించారు.ప్రస్తుతం రాష్ట్రంలో గ్రీన్ చానల్ ద్వారా నిధులు ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదని, 20 శాతం కమిషన్ ఇచ్చే వారికి మాత్రమే బిల్లులు విడుదల చేస్తూ, కమిషన్ ఇవ్వని వారి బిల్లులను పెండింగ్‌లో పెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రసాధకుడైన కేసీఆర్‌ను అవమానించేలా మాట్లాడటం మానేసి, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. చిల్లర రాజకీయాలు వదిలి, పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, హాస్టల్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని హరీష్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రజలందరికీ క్రిస్టమస్ శుభాకాంక్షలు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- బయ్యారం చర్చి వేడుకలలో పాల్గొన్న మంత్రి

ప్రతిపక్షం, మధిర, డిసెంబర్25: మధిర నియోజకవర్గంలోని బయ్యారం చర్చిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ..చారిత్రాత్మకమైన బయ్యారం చర్చి నిర్మించుకొని 125 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చర్చికు చేరుకున్న సోదర సోదరీమణులందరికీ, స్నేహితులకు, రాష్ట్ర ప్రజలందరికీ క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. మనం అంతా ప్రేమతో ఆప్యాయతో బతికేలా ఉండాలని ప్రతి సంవత్సరం ఈ చర్చి నుంచి ప్రభువును ప్రార్థిస్తున్నానన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ప్రభువు ఆశీర్వాదాలు ఉండాలని, మంచి జరగాలని, కుటుంబాలు బాగా ఎదిగి పిల్లలు మంచిగా చదువుకొని ఎదగాలని ఫాదర్‌తో ప్రార్థన చేయించుకుని ఇక్కడి నుంచి బయలుదేరుతానన్నారు. ఒకరికి మరొకరు సహాయ సహకారాలతో జీవించేందుకు ప్రభువు ఆశీస్సులు మనందరిపై ఉండాలని ప్రభువును ప్రార్థిస్తున్నాను అన్నారు. ప్రజలందరి యోగక్షేమాల కోసం ఈ అధికారం ఉపయోగపడే విధంగా మన ఆలోచనలు మనం మార్గం ఉండేటట్టుగా ప్రభువు మనల్ని నడిపించాలని ఆ ప్రభువును కోరుకుంటున్నానని తెలిపారు. బయ్యారంలో అభివృద్ధి కోసం కాకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం భగవంతుడు నిండుగా మనకు శక్తిని ఇవ్వాలని, ఆయన శక్తితో వచ్చే అధికారం హోదాతో కూడా ప్రజా సంక్షేమ కోసం ఉపయోగపడేట్టుగా మన ఆలోచనలు మన మార్గాన్ని నడిపించే విధంగా వారు ఆశీర్వదిస్తారని మనస్పూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. అందరికీ రాబోయే రోజుల్లో మంచి జరగాలని ఈ క్రిస్మస్ సందర్భంగా శుభాకాంక్షలతో పాటు నూతన సంవత్సర శుభాకాంక్షలు అందరికి తెలియజేస్తున్నానన్నారు.

తల్లి, కుమారుడి హత్య..మరొకరికి గాయాలు

- తెల్లాపూర్ లో ఘటన

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 25 : కత్తిపోట్లతో తల్లి, కుమారుడు అనుమానస్పదంగా హత్యకాగా, మరో వ్యక్తి రక్తపు మడుగులతో ఆస్పత్రిలో చేరిన సంఘటన గురువారం సంగారెడ్డి జిల్లా కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ప్రాథమికంగా తెలిసిన వివరాల ప్రకారం నారాయణపేట జిల్లా కర్నీకి చెందిన శివ, వనపర్తి జిల్లా అమరచింతకు చెందిన మహిళ చంద్రకళ(30), ఆమె కుమారుడు రేవంత్(14)ను తీసుకొని తెల్లాపూర్ జ్యోతి రావు పూలే కాలనీలో నాలుగు రోజుల క్రితం వచ్చి నివాసం ఉంటున్నాడు. శివ క్యాబ్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. ఆయితే ఇంట్లో అలికిడి లేకపోవడంతో చుట్టుపక్కల వారు చూసేసరికి తల్లి చంద్రకళ, అమె కుమారుడు రేవంత్ లు హత్యకు గురయ్యారు. శివ అనే వ్యక్తి తీవ్రంగా రక్తపు మడుగులో గాయపడ్డాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శివను స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి కొల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ హత్య వివాహేతర సంబంధం నేపథ్యంలో జరిగినట్లుగా పోలీసులు భావిస్తున్నారు.

క్రిస్మస్ వేడుకల్లో నిర్మలా జగ్గారెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 25 : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి పట్టణంలోని పలు చర్చ్‌లలో నిర్వహించిన వేడుకల్లో టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. మొదటగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ఆసుపత్రి సిబ్బంది, పేషంట్ల సమక్షం లో కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సంగారెడ్డి లోని మెథడిస్ట్ చర్చ్, సి ఎస్ ఐ చర్చ్, రాక్ చర్చ్, హోసన్న చర్చ్, సౌందర్య సీయోను చర్చ్ లలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె చర్చి లలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మత పెద్దలు, పాస్టర్ లతో కలసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. చర్చి పెద్దలు నిర్మలా జగ్గారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రేమ, శాంతి, సౌహార్ద్రతకు ప్రతీక అయిన క్రిస్మస్ పండుగను ప్రతి ఒక్కరూ ఐక్యతతో జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్ , కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ జార్జ్, క్రిస్టియన్ కోఆర్డినేటర్ మధు, నాయకులు కూన సంతోష్, చర్చి ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రేమ, కరుణ, త్యాగాలను బోధించిన క్రీస్తు

- ఆయనసందేశం ప్రతి మనసును వెలిగించాలి: ఎమ్మెల్యే నాగరాజు

ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్25: క్రీస్తు ప్రార్థన మందిరంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిథిలుగా ఎమ్మెల్యేలు కడియం, నాయిని, నాగరాజు క్రైస్తవుల పవిత్ర క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కరుణపురం లోని క్రీస్తు ప్రార్థన మందిరంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో స్థానిక స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీస్తు ప్రధాన మందిరంలో పాస్టర్ పాల్సన్ రాజు ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యేలు కడియం, నాయిని, నాగరాజు పాల్గొని క్రైస్తవ సోదర సోదరీమణులతో కలిసి ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ పండుగ ప్రేమ, త్యాగం, శాంతి మరియు మానవత్వానికి ప్రతీక అని ఆయన అన్నారు. యేసుక్రీస్తు సందేశం సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. అన్నిమతాలు, వర్గాలు కలిసిమెలసి జీవించడమే తెలంగాణ సంస్కృతి అని, అలాం అలాంటి ఐక్యతను ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో చర్చిల పాస్టర్లు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కిల్ స్కామ్‌లో సాక్ష్యాలు లేవని సిట్‌తో చెప్పించి చంద్రబాబు కేసు ఉపసంహరింప చేయడం దారుణం. ఆధారాలతోనే చంద్రబాబును జైల్లో పెట్టారు. సుప్రీం కోర్టులో బాబు స్క్వాష్ పిటిషన్‌పై సాక్ష్యాలున్నాయని కౌంటర్ వేశారు. అది పెండింగ్ ఉండగా ఎలా ఉపసంహరిస్తారు. సాక్ష్యాలన్నీ ఏమయ్యాయి?. వీటిపై సుప్రీంకి వెళ్తాం. ఉద్యోగుల్నీ దోషులుగా నిలబెడతాం.

- వైసీపీ నేత సుధాకర్‌రెడ్డి

ప్రతిపక్షం
Prathipaksham.in
4
హైదరాబాద్
శుక్రవారం
26.12.2025
@prathipaksham
prathipakshamtvtelugu

ఓపెన్ వాయిస్

'సర్'తో అంతా సరయ్యేనా?

భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. మరోవైపు మేధావి వర్గం సైతం అభ్యంతరాలు చెబుతోంది. ఈ సవరణలో భాగంగా చాలా రాష్ట్రాల్లో భారీ సంఖ్యలో ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారు. దీంతో ఇది దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఎన్నికల సంఘం తాజాగా తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాల ప్రకారం తమిళనాడులోని 97.37 లక్షల ఓట్లను తొలగించినట్లు ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది. గుజరాత్ లోను 73 లక్షల ఓట్లను జాబితా నుంచి తొలగించారు. తొలుత బీహార్లో ఈ ప్రక్రియ చేపట్టి ఎన్నికలు నిర్వహించారు. అక్కడ ఎన్డీఏ ఘనవిజయం సాధించడంతో ప్రత్యేక సమగ్ర సవరణ అనేది రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్నది అనే వాదన బలపడింది. ప్రజాస్వామ్యం పారదర్శకంగా ఉండాలన్న ఆలోచనతోనే ఈ ప్రక్రియ చేపట్టినట్లు కేంద్ర ఎన్నికల సంఘం చెబుతోంది. బీహార్లో ప్రత్యేక ఏజెన్సీ ద్వారా అధ్యయనం చేసిన తరువాత మాత్రమే ఈ ప్రక్రియ చేపట్టినట్లు చెప్పుకోస్తోంది ఎన్నికల సంఘం. వాస్తవానికి ప్రతి రాష్ట్రంలోనూ మరణించిన వారి పేరుతో ఓట్లు ఉంటున్నాయి. వలస వెళ్లిన వారి పేరుతో ఓట్లు ఉంటున్నాయి. కొందరికి రెండు చోట్ల కూడా ఓట్లు ఉంటున్నాయి. ఈ విషయంలో ప్రత్యేక సమగ్ర సవరణ మంచిదే. కానీ ప్రజలతో పాటు మేధావుల సందేహాలను నివృత్తి చేయడంలో మాత్రం ఎలక్షన్ కమిషన్ అనుకున్న స్థాయిలో శ్రద్ధ చూపడం లేదు. అందుకే రాజకీయ పార్టీల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్నికల సంఘం మాత్రం ఈ ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారమే జరుగుతోందని స్పష్టం చేస్తోంది. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల అనంతరం అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పిస్తున్నామని, అర్హులైన ఓటర్లు తమ పేరును తొలగించబడితే సంబంధిత బూత్ లెవెల్ అధికారులకు కానీ, ఈసీ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచిస్తుంది. తుది జాబితా విడుదలకు ముందు అన్ని అభ్యంతరాలను పరిశీలిస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే బీహార్లో తమ ఓట్లు గల్లంతయ్యాయని చాలామంది ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో తమ ఓట్లను దూరం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ అభ్యంతరాలు ఉంటే చెప్పాలని చెబుతోంది. తమ ఓటు ఉందో లేదో తెలుసుకోవాలని సూచిస్తుంది. అయితే ఇప్పటివరకు తమ సొంత ప్రాంతంలో ఓటు వేసేవారు. తాము నిజంగా ఓటర్లమని ధ్రువీకరించుకోవాల్సి వస్తోంది. దీనిపైనే ఎక్కువగా ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. చనిపోయారని చెప్పి చాలా మంది ఓట్లను తొలగించారు. అటువంటి వారు న్యాయస్థానాలను ఆశ్రయించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే ఈ సమగ్ర సవరణ అనేది మంచి కార్యక్రమమే. కానీ సరైన అధ్యయనం చేయకుండా చేస్తే మాత్రం ఇబ్బందికరమే. మనది అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ ఓటు అనేది ఆయుధం. అటువంటి ఓట్లను సవరించే క్రమంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. బీహార్లో అధ్యయనం చేసిన తరువాత మాత్రమే మిగతా రాష్ట్రాల్లో చేస్తున్నామని ఎలక్షన్ కమిషన్ చెబుతోంది. కానీ ఈ అధ్యయనం ఎవరు చేశారు? ఏ సంస్థ చేసింది? ఏమని నివేదిక ఇచ్చింది? అనే విషయాలను మాత్రం ఎలక్షన్ కమిషన్ బయట పెట్టడం లేదు. అందుకే ఇప్పుడు అందరిలోనూ అదే అనుమానం. దేశవ్యాప్తంగా సమాజం పట్ల అవగాహన ఉన్న పౌరులతో పాటు తటస్థులు, మేధావులు ఇదే విషయంపై ప్రశ్నిస్తున్నారు. కానీ ఎన్నికల కమిషన్ నుంచి ఆశించిన స్థాయిలో జవాబు రావడం లేదు. ఇప్పటికే ఎన్డీఏ పై ఒక అపవాదు ఉంది. ఈవీఎంల టాంపరింగ్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. దానిపై ఒక వైపు గలాటా నడుస్తుంటే.. కొత్తగా సమగ్ర సవరణ విషయంలో ఎన్నికల కమిషన్ ఎంత జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి. రాజ్యాంగబద్ధమైన ఓ స్వతంత్ర సంస్థగా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఎన్నికల కమిషన్ పై ఉంది. దానినే గుర్తు చేస్తున్నారు మేధావులు. ఆపై పౌర సమాజం. ఇక తేల్చుకోవాల్సింది ఎన్నికల కమిషన్ మాత్రమే.

ప్రతిపక్షం
హైదరాబాద్,
శుక్రవారం
26.12.2025

చితికిపోతున్న చిన్నారి కలలు!!

ఆధునిక యుగంలో స్మార్ట్‌ఫోన్ మరియు ఇంటర్నెట్ లభ్యత ప్రతి ఒక్కరి అరచేతిలోకి చేరింది. అయితే సరైన అవగాహన లేని మైనర్ల చేతిలో ఇది ఒక వినాశకర ఆయుధంగా మారుతోంది. సోషల్ మీడియాలో నిరంతరం ప్రసారమయ్యే అసభ్యకరమైన రీల్స్, లైంగిక ప్రేరేపిత వెబ్ సిరీస్‌లు మరియు సినిమాల ప్రభావంతో తెలియని వయసులో బాలికలు శారీరక ఆకర్షణలకు లోనవుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుంటున్న అకతాయి యువకులు మరియు మోసగాళ్లు ప్రేమ పేరుతో మైనర్లకు వల వేసి ట్రాప్ చేస్తున్నారు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు, చట్టం ప్రకారం మైనర్ల అంగీకారానికి విలువ లేదని తెలియని అమాయకత్వం వారి జీవితాలను బలి తీసుకుంటున్నాయి.

వెంకగారి భూమయ్య
9848559863

దక్షిణ భారతదేశం అక్షరాస్యతలోనూ, ఐటీ రంగంలోనూ అగ్రగామిగా దూసుకుపోతున్న తరుణంలో, టీనేజ్ ప్రెగ్నెన్సీ లేదా కౌమార గర్భధారణ అనే చేదు నిజం మన పురోగతిని తీవ్రంగా ప్రశ్నిస్తోంది. కర్ణాటకలో గత మూడేళ్లలో ఏకంగా 2,320 మంది మైనర్ బాలికలు గర్భవతులు కావడం, అందులో ఈ ఏడాది అక్టోబర్ నాటికే 749 కేసులు నమోదు కావడం కేవలం గణాంకాలు మాత్రమే కాదు, అవి వేల సంఖ్యలో బాలికల భవిష్యత్తు ఛిద్రమైపోతుందనడానికి సజీవ సాక్ష్యాలు. ఇది కేవలం కర్ణాటకకు మాత్రమే పరిమితమైన సమస్య కాదు, తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కూడా ఈ పరిస్థితి ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ అనూహ్య పెరుగుదల వెనుక ఉన్న సామాజిక కారణాలు, సాంకేతికత దుర్వినియోగం మరియు విద్యా వ్యవస్థలోని లోపాలను నిశితంగా పరిశీలిస్తే భయానక వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి.

డిజిటల్ మాయాజాలం.. ఆకర్షణల సుడిగుండం

ప్రస్తుత ఆధునిక యుగంలో స్మార్ట్‌ఫోన్ మరియు ఇంటర్నెట్ లభ్యత ప్రతి ఒక్కరి అరచేతిలోకి చేరింది. అయితే సరైన అవగాహన లేని మైనర్ల చేతిలో ఇది ఒక వినాశకర ఆయుధంగా మారుతోంది. సోషల్ మీడియాలో నిరంతరం ప్రసారమయ్యే అసభ్యకరమైన రీల్స్, లైంగిక ప్రేరేపిత వెబ్ సిరీస్‌లు మరియు సినిమాల ప్రభావంతో తెలియని వయసులో బాలికలు శారీరక ఆకర్షణలకు లోనవుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుంటున్న అకతాయి యువకులు మరియు మోసగాళ్లు ప్రేమ పేరుతో మైనర్లకు వల వేసి ట్రాప్ చేస్తున్నారు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు, చట్టం ప్రకారం మైనర్ల అంగీకారానికి విలువ లేదని తెలియని అమాయకత్వం వారి జీవితాలను బలి తీసుకుంటున్నాయి. పరస్పర అంగీకారం అనే ముసుగులో జరుగుతున్న ఈ లైంగిక చర్యలు చివరకు ఆ బాలికలు కౌమార దశలోనే మాతృత్వాన్ని భరించాల్సిన దుస్థితికి దారితీస్తున్నాయి. డిజిటల్ యుగంలో ఆకర్షణలకు లోనవుతున్న మైనర్లను రక్షించడంలో అటు తల్లిదండ్రులు, ఇటు సమాజం ఘోరంగా విఫలమవుతున్నాయి.

వ్యవస్థల నిర్లక్ష్యం, హాస్టల్ బాత్రూమ్‌లలో ప్రసవాలు

ఇటీవల కర్ణాటకలోని యాదగిరి, శివమొగ్గ జిల్లాల్లో జరిగిన సంఘటనలు సభ్య సమాజాన్ని ఉలిక్కిపడేలా చేశాయి. ఒక ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలిక హాస్టల్ బాత్రూమ్‌లో బిడ్డకు జన్మనివ్వడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలిచింది. తొమ్మిది నెలల పాటు గర్భంతో ఉన్న బాలిక శరీరంలో వచ్చే మార్పులను గానీ, ఆమె ఎదుర్కొంటున్న మానసిక క్షోభను గానీ వార్డెన్లు లేదా ఉపాధ్యాయులు గుర్తించలేకపోవడం వ్యవస్థాగత వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. ఇది కేవలం పర్యవేక్షణ లోపాన్ని మాత్రమే కాకుండా, బాలికలకు తమ సొంత ఆరోగ్యం మరియు రక్షణపై ఉన్న అవగాహన రాహిత్యాన్ని కూడా సూచిస్తోంది. లైంగిక విద్యను మన సమాజంలో ఇప్పటికీ ఒక నిషిద్ధ అంశంగా భావించడం వల్ల, ఆపదలో ఉన్న బాలికలు తమ సమస్యను ఎవరికీ చెప్పుకోలేక మౌనంగా ఉండిపోతున్నారు. ఈ మౌనమే చివరకు ప్రాణాపాయ స్థితిలో రహస్య ప్రసవాలకు దారితీస్తోంది.

ఆరోగ్య విపత్తు, శిశు మరణాల ముప్పు

టీనేజ్ ప్రెగ్నెన్సీ అనేది కేవలం ఒక సామాజిక కళంకం మాత్రమే కాదు, ఇది అత్యంత తీవ్రమైన ఆరోగ్య సంక్షోభం కూడా. మైనర్ల శరీరం ప్రసవానికి అవసరమైన పూర్తిస్థాయి ఎదుగుదలను కలిగి ఉండదు. ఈ చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల ప్రసూతి మరణాల ముప్పు పెరగడంతో పాటు, బాధితుల్లో తీవ్రమైన రక్తహీనత సంభవిస్తుంది. వీరికి పుట్టే శిశువులు కూడా తరచుగా తక్కువ బరువుతో లేదా పోషకాహార లోపంతో జన్మిస్తారు, ఇది ఒక బలహీనమైన తరాన్ని సృష్టించే ప్రమాదం ఉంది. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలోని వెనుకబడిన ప్రాంతాల్లో బాల్య వివాహాల వల్ల జరిగే గర్భధారణలు ఆ బాలికల విద్యావకాశాలను పూర్తిగా దెబ్బతీస్తున్నాయి. పాఠశాల చదువు మధ్యలో ఆగిపోవడంతో వారు ఆర్థికంగా ఇతరులపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడి పేదరికంలో మగ్గిపోతున్నారు.

చట్టపరమైన సవాళ్లు, సామాజిక రాజీ ధోరణి

పోక్సో చట్టం కింద మైనర్లతో లైంగిక సంబంధం పెట్టుకోవడం అత్యంత కఠినమైన నేరం అయినప్పటికీ, చాలా కేసుల్లో నిందితులు శిక్ష నుంచి తప్పించుకుంటున్నారు. దీనికి ప్రధాన కారణం సమాజంలో పరువు పోతుందనే భయం. సామాజిక బహిష్కరణకు గురవుతామనే ఆందోళనతో బాధితురాలి కుటుంబ సభ్యులు నిందితులతో ప్రాథమిక దశలోనే రాజీ పడుతున్నారు. ఈ రాజీ ధోరణి నేరగాళ్లకు వరంలా మారి మరిన్ని అరాచకాలు జరగడానికి ప్రేరణనిస్తోంది. ప్రభుత్వాలు బాధితులకు ఆర్థిక సాయం, బీమా వంటి పథకాలు అందిస్తున్నప్పటికీ, ఆ అమ్మాయిలు కోల్పోయిన బాల్యాన్ని, గౌరవాన్ని తిరిగి తీసుకురాలేవు. చట్టాలు పకడ్బందీగా అమలు కాకపోవడం మరియు సాక్ష్యాధారాల లోపం వల్ల బాధితులకు న్యాయం జరగడం గగనంగా మారుతోంది.

సమిష్టి బాధ్యత, పరిష్కార మార్గాలు

ఈ పెను విపత్తును అరికట్టాలంటే కేవలం చట్టాలు లేదా ప్రభుత్వ పథకాలు మాత్రమే సరిపోవు. ప్రతి గ్రామం మరియు పట్టణ స్థాయిలో సమగ్రమైన మార్పు రావాలి. పాఠశాలల్లో విద్యార్థులకు చిన్నప్పటి నుంచే లైంగిక వేధింపుల పట్ల మరియు శరీరంలో వచ్చే మార్పుల పట్ల శాస్త్రీయమైన అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూ వారి మానసిక స్థితిని గమనిస్తూ ఉండాలి. స్మార్ట్‌ఫోన్ వినియోగంపై పరిమితులు విధించడంతో పాటు డిజిటల్ అక్షరాస్యతను పెంచాలి. అంగన్వాడీ మరియు ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో నిరంతర నిఘా ఉంచాలి. సమాజం కూడా బాధితులను హేళన చేయకుండా వారికి పునరావాసం కల్పించడంలో తోడ్పడాలి. మైనర్ బాలికలు తల్లి కావడం అంటే ఆ దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడినట్లేనని గుర్తించి, ఈ నిశ్శబ్ద విపత్తును రూపుమాపడానికి ప్రతి పౌరుడు సమిష్టిగా పోరాడాలి.

(విశ్లేషకులు సీనియర్ జర్నలిస్టు)

ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకమేనా?

పల్లె నాగరాజు
8500431793

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ సంక్షోభంలో పడింది అనడానికి ప్రభుత్వం ఇటీవల విద్యారంగంలో మార్పులు తీసుకోని రావడానికి తీసుకుంటున్న నిర్ణయాలే నిదర్శనం. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ)లో రాష్ట్రం యొక్క ర్యాంక్ పడిపోకుండా ఉండటం కోసం, 1,441 బడులను జీరో ఎన్ రోల్ మెంట్ కారణంగా మూసి వేయ్యాలని విద్యాశాఖ తీసుకున్న నిర్ణయం రాష్ట్రంలో విద్యాశాఖ దయనీయ స్థితికి అద్దం పడుతుంది. కేంద్ర ప్రభుత్వం జులై నెలలో విడుదల చేసిన నివేదిక ప్రకారం దేశంలో విద్యార్థులు లేని పాఠశాల జాబితాలో పశ్చిమ బెంగాల్ మొదటి స్థానంలో ఉండగా తెలంగాణ రెండో స్థానంలో ఉండేది. తాజాగా కేంద్రం ప్రకటించిన నివేదికలో జీరో ఎన్ రోల్ మెంట్ ఉన్న జాబితాలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని ప్రకటించింది. దీనితో రాష్ట్ర పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ) ర్యాంక్ పడిపోతుంది. దీనితో ప్రభుత్వం 1441 పాఠశాలలను మూసి వేసి 2026 27 యూడైస్ లెక్కల నుండి తొలిగించాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. మరో 640 పాఠశాలలో కేవలం ఉపాధ్యాయులు మాత్రమే ఉండి, ఒక్క విద్యార్థి కూడ లేకపోవడంతో అందులో పని చేస్తున్న ఉపాధ్యాయులను వేరే పాఠశాలలకు డిప్యుటేషన్ పై పంపించి వాటిని కూడ త్వరలో మూసి వేయ్యాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనితో ప్రభుత్వ విద్య పట్ల పాలక వర్గాలకు ఉన్న శ్రద్ధ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్రంలో 26 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 202425 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో 2,081జీరో ఎన్ రోల్ మెంట్ పాఠశాలలు ఉన్నట్టు తేలగా, ప్రస్తుతానికి 1,441 స్కూళ్లను మూసి వేయ్యడంతో పాటు, మిగిలిన 640 పాఠశాలలను మూసివేస్తే ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 24 వేల లోపే పరిమితం కానుంది. ఇవే కాకుండా సంవత్సరం క్రితం నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో విద్యా రంగంపైన జరిగిన చర్చలో 3,144 అప్పర్ ప్రైమరీ పాఠశాలల విలీనంపైన నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించడం జరిగింది. అంటే భవిష్యత్తులో అప్పర్ ప్రైమరీ పాఠశాలలు కూడ మూసివేసే ప్రమాదం ఉంది. ఇటు 2వేల జీరో ఎన్ రోల్ మెంట్ బడులు, అటు అప్పర్ ప్రైమరీ పాఠశాలు మొత్తంగా కలిపి 5వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలు శాశ్వతంగా కనుమరుగయ్యే పరిస్థితి ఉంది. ఈ పరిస్థితికి తోడు ఇటీవల విడుదల చేసిన తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ 2047లోను ఒకే ప్రాంగణంలోని ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలలను విలీనం చెయ్యాలని ప్రకటించారు. దీనితో మరికొన్ని పాఠశాలలు కనుమరుగయ్యే పరిస్థితితులు ఉన్నాయి. గ్రామాలలో పాఠశాలలు మూతపడటం వల్ల పేద, దళిత, గిరిజన, వెనుక బడిన వర్గాల పిల్లలు విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఉంది. దూరంగా ఉన్న పాఠశాలలకు వెళ్ళలంటే రవాణా ఖర్చులు భరించలేని తల్లి దండ్రులు పిల్లలను బడి మాన్పించే అవకాశం ఉందికిలో మీటర్ల దూరం నడిచి వెళ్లి చదువుకోవడం చిన్న పిల్లలకు భారంగా మారుతుంది. ముఖ్యంగా ఆడపిల్లల విద్యపైన తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇది మధ్యలో చదువు మానేసే వారి (డ్రాపౌట్స్)సంఖ్యను పెంచుతుంది. ఇది బాలకార్మిక వ్యవస్థకు లేదా బాల్య వివాహలకు దారితీయవచ్చు. ప్రభుత్వ పాఠశాలలను మూసి వెయ్యడం కంటే వాటిని పునరుద్ధరించే దిశగా ప్రభుత్వం ఆలోచన చెయ్యాలి. ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ విద్యను, ఆంగ్ల మాధ్యమాన్ని బలోపేతం చెయ్యాలి. పాఠశాలలో మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించాలి. తాగు నీరు, టాయిలెట్స్ సౌకర్యాలు లేని పాఠశాలలు రాష్ట్రంలో చాలా ఉన్నాయి. గ్రామాలలోని సర్పంచులను, విద్యా కమిటీలలో భాగస్వామ్యం చేసి అడ్మిషన్లు పెంచేలా చర్యలు తీసికోవాలి. ఖాళీగా ఉన్న పర్యవేక్షణ అధికారుల పోస్టులను భర్తీ చేసి పాఠశాలలో బోధనపైన పర్యవేక్షణ చెయ్యాలి. దీనితో తల్లి దండ్రులకు ప్రభుత్వ పాఠశాలల పైన నమ్మకం కలిగి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించే అవకాశాలు ఉన్నాయి. పాఠశాలల మూసివేత తాత్కాలికమే విద్యార్థులు వస్తే మళ్ళీ తెరుస్తాం అన్న ప్రభుత్వ ప్రకటన ఆచరణలో సాధ్యం అవుతుందా? ఒక్కసారి మూత పడిన పాఠశాల మళ్ళీ తెరుచుకోవడం వ్యవస్థలో చాలా అరుదు. ప్రభుత్వం ర్యాంకింగ్ కోసం పాఠశాలలను మూసివేసి దళిత, గిరిజన, వెనుక బడిన వర్గాల పిల్లలకు ప్రాథమిక విద్యను దూరం చెయ్యకూడదు. పాఠశాలలను మూసివేయడం సమస్యకు ముగింపు కాదు. అది ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చెయ్యడంలో ప్రభుత్వ వైఫల్యానికి అంగీకారం మాత్రమే అవుతుంది. పాఠశాలల మూసివేతను విద్యావేత్తలు, యువజన, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు వ్యతిరేఖించాల్సిన అవసరం ఉంది. లేకపోతే భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకమేఅవుతుంది.

(వ్యాసకర్త తెలంగాణ ప్రోగ్రెసీవ్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యుడు)

చరిత్రమరిచిన ఉద్ధం సింగ్ చమార్ దేశభక్తి

సంపతి రమేష్ మహారాజ్
7989579428

భారత స్వాతంత్ర సంగ్రామ చరిత్రలో జలియన్ వాలాబాగ్ ఉదంతం అత్యంత హేయమైన సంఘటన. నాటి బ్రిటిష్ పాలకుల దుశ్చర్యకు వందలాది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని చరిత్రలో లిఖించారు. పంజాబ్ రాష్ట్రంలో జలియన్ వాలాబాగ్ అనేది అమృత్‌సర్ పట్టణంలోని ఓ తోట. 1919 ఏప్రిల్ 13న డాక్టర్ సత్య పాల్, సైపుద్దీన్ కిచ్లూ అరెస్టులకు నిరసనగా బైసాఖీ పండుగ రోజు వేలాది ప్రజలు జలియన్ వాలాబాగ్ మైదానంలో సమావేశయ్యారని, ఇది అనాడు రౌలట్ చట్టానికి నిరసన సమావేశమని బ్రిటిష్ వారికి తెలియడంతో బ్రిగేడియర్ జనరల్ రెజినాల్డ్ డైర్ ఆదేశాల మేరకు సైనికులు బాగ్ మార్గాన్ని మూసివేసి సాధారణ ప్రజలపై కాల్పులు జరిపారని చరిత్ర చెబుతుంది. స్థానికుల ప్రకారం రెండు వేలమంది మరణించారు. డైర్ చర్యకు పంజాబ్ లెఫ్టినెంట్ గవర్నర్ మైఖేల్ ఓ. డ్వయర్ మద్దతు పలికాడని, ఆ సంఘటనలో ఉద్ధం సింగ్ స్నేహితులు చనిపోవడంతో ప్రతీకారంగా ఆయన 1940 మార్చి 13న లండన్ కాక్స్టన్ హాల్‌లో గవర్నర్ మైఖేల్ ఓ.డ్వయర్‌ను కాల్చిచంపినట్లు చెబుతారు. ఉద్ధం సింగ్ గద్దర్ పార్టీ, హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్‌లో చేరి విప్లవ కార్యకలాపాలు నడిపాడు. 1927లో ఆయుధాలతో భారత్‌కు వచ్చి జైలు శిక్ష కూడా అనుభవించాడు. జలియన్ వాలాబాగ్ దుర్ఘటనకు ప్రతీకారంగా మైఖేల్ ఓ. డ్వయర్‌ను చంపి "ఇది నా దేశం, ప్రజల కోసం" అని ప్రకటించి 1940 జులై 31న లండన్ పెంటోన్‌విల్ జైలులో ఉరికంభమెక్కడంతో "షహీద్‌ఎఆజమ్" అని పిలుస్తారని ఆధిపత్య కోణంలో రాసిన సాంప్రదాయిక చరిత్ర. దళితుల కోణంలో ఈ చరిత్రను అధ్యయనం చేస్తే అంతర్లీన వివక్షత రూపం అర్థమవుతుంది.

జలియన్ వాలాబాగ్ ఓ కుట్రపూరిత ఉదంతం

భారతీయ కుల వ్యవస్థలో అట్టడుగు వర్గాలు సామాజిక దుర్విచక్షణకు గురైనారు. వారంతా దేవాలయాల్లోకి అనుమతించకపోవడం, నైవేద్య ప్రసాదానికి, మోక్షానికి అనర్హులు. ఈ వివక్షత నుంచి బయటపడడానికి దళిత, బహుజనులు సిక్కు మతంలోకి మారారు. ఈ మతగ్రంథమైన 'ఆది గ్రంథ్'లో చమార్ కులానికి చెందిన సంత్ రవిదాస్ బోధనలున్నాయి. సిక్కు సంప్రదాయం కులవ్యవస్థ, బ్రాహ్మణాధిక్యతకు వ్యతిరేకంగా సమానత్వం, లంగర్, కరాహ్ ప్రసాదం ద్వారా అందరికీ సమాన హక్కులు కల్పించిన భారతీయ మతం. సర్దార్ ఉద్ధం సింగ్ కూడా చమార్ (దళిత) కులానికి చెందిన రవిదాసియా సిక్కు. 1899 డిసెంబర్ 26న పంజాబ్‌లోని సునామ్ గ్రామంలో పుట్టాడు. అనాథాశ్రమంలో పెరిగాడు. 1699లో గురు గోబింద్ సింగ్ గారు ఖాల్సా పంథ్‌ను స్థాపించిన రోజుగా వైశాఖిని (బైశాఖి) జరుపుకుంటారు. ఇది చాలా పవిత్రమైన పండగ. ప్రతి ఏటా పంజాబీలోని వైశాఖి రోజున గురుద్వారాలలో కరాహ్ ప్రసాదం పంచుతారు. దళిత సిక్కులు ఈ ప్రసాదాన్ని పంచడానికి అగ్ర కుల బ్రాహ్మణ సిక్కులు అనుమతించలేదు. దీంతో వేలాది దళిత సిక్కులు 1919 ఏప్రిల్ 13న జలియన్ వాలాబాగ్ మైదానంలో చేరుకొని సమావేశమైనారు. దీన్ని బ్రాహ్మణ సిక్కులు బ్రిటిష్ వారిపై దాడికి యత్నిస్తున్నారని తప్పుడు సమాచారమివ్వడంతో బ్రిటిష్ ఆర్మీ అధికారి డైర్ కాల్పులకు ఆదేశించాడు. పంజాబ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న మైఖేల్ ఓ'డ్వైర్ దయ్యర్ ఈ దుర్ఘటనకు మద్దతు పలికాడు. జలియన్ వాలాబాగ్ మైదానంలో వాలంటీర్ గా పనిచేసిన ఉద్ధం సింగ్ తన కళ్ళెదుట అసువులు బాసిన వారిని చూసి చలించాడు. ఆయన లండన్ వెళ్ళి మైఖేల్ ఓ'దయ్యర్ ను హత్య చేశాడు.. 1995లో మాయావతి ఉద్ధం సింగ్ పేరుమీదనే ఒక జిల్లాను ఏర్పాటు చేసి ఆయనకు నివాళి అర్పించారు. తెలుగు రాష్ట్రాల్లో డాక్టర్ విశారదన్ మహారాజ్ సర్దార్ ఉద్ధం సింగ్ చమార్ ను పరిచయం చేసి దళితుల్లో చైతన్యాగ్నిని రగిలించాడు. ఆది జాంబవంతు నుంచి అంబేద్కర్ వరకు ఈ మట్టిపై పుట్టిన ఎందరో బహుజన పరాక్రమ వీరుల చరిత్రతో ప్రేరణ పొంది విముక్తి వైపు ప్రయాణించాలి.

ఉద్ధం సింగ్ చమార్ జయంతి డిసెంబర్ 26
వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
90102 23917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

మానవాళికి క్రీస్తు శాంతి సందేశం స్ఫూర్తిదాయకం

- నీలం మధు ముదిరాజ్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 25 : శాంతి, సౌభ్రాతృత్వం, కరుణ, క్షమాగుణం నేర్పే క్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఆదర్శనీయం, అనుసరణీయమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం క్రిస్టమస్ పర్వదినాన్ని పురస్కరించుకొని చిట్కుల్ పరిధిలోని బ్యులా, ఎంవీ చర్చిలలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని కేక్ కట్ చేసి, ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో కలిసి వికలాంగులకు నిత్యావసర సరుకులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుడిగా ప్రజల మధ్యనే నడయాడి సమాజానికి శాంతి సందేశం అందించిన దయామయుడు యేసుక్రీస్తు అని కొనియాడారు. క్రీస్తు చూపిన శాంతి మార్గం సర్వ మానవాళికి స్ఫూర్తి దాయకమని, ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ ప్రతి ఒక్కరూ ప్రేమ, జాలి, దయా గుణాలు కలిగి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాలలో బ్యూలా చర్చి నిర్వాహకులు ప్రకాష్ రావు, రాజ్యలక్ష్మి, ఎంవీ చర్చి నిర్వాహకులు శ్రీమాన్, వికలాంగుల సంఘం రాష్ట్ర నాయకులు రవి, మాజీ పిఎసిఎస్ చైర్మన్ నారాయణ రెడ్డి, రజక సంఘం రాష్ట్ర నాయకులు సిహెచ్ వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు గోపాల్, రాజ్ కుమార్, గౌరి శంకర్, అనిల్, నిర్వాహకులు, క్రైస్తవ నాయకులు,సోదర,సోదరీమణులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు,ప్రజలు పాల్గొన్నారు.

నాళేశ్వర్ గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు సన్మానం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 25 : జిల్లాలోని నవీపేట్ మండలం నాళేశ్వర్ గ్రామ సర్పంచ్ ఆర్మూర్ లావణ్య, ఉపసర్పంచ్ ఆర్మూర్ శ్రీనివాస్‌లను మాజీ సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మండ్లు గురువారం సర్పంచ్ నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హన్మండ్లు మాట్లాడుతూ నాళేశ్వర్ గ్రామ పంచాయితి ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించిన సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు గ్రామ ప్రజలంతా పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. అలాగే గ్రామంలో ఎలాంటి సమస్యలు లేకుండా, అభివృద్ధి పథంలో నిలుపాలన్నారు. ఈ సందర్భంలో ఏడవ వార్డు సభ్యుడు ఆర్మూర్ గణేష్‌ను అభినందిస్తూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంజీవ్, ఆశిస్, గణేష్ పాల్గొన్నారు.

వాజ్ పేయి జీవితం నేటితరానికి ఆదర్శం

- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 25 : మాజీ ప్రధాని భారతదేశానికి మూడుసార్లు ప్రధానమంత్రిగా సేవలందించిన అటల్ బిహారీ వాజ్ పేయి ను నేటితరం యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పేయి 101 జయంతి నీ పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అపర మేధావి కవి అయిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పేయి మాటల్లో మృదుత్వం అందరినీ ప్రేమగా పలకరించే స్వభావం కలిగిన వ్యక్తి అన్నారు. ప్రధానిగా ఉన్న సమయంలో దేశ అభివృద్ధి కోసం ఎన్నో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకువచ్చారని, దేశ ప్రజల అభివృద్ధి సంక్షేమం భద్రత కోసం కీలక నిర్ణయాలు తీసుకున్న ఘనత వాజ్ పేయ్ కే దక్కుతుందన్నారు. అణు పరీక్షల ఒప్పందం తదితర ఇతర ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చి ప్రపంచంలోనే భారతదేశానికి ఒక గౌరవాన్ని తీసుకువచ్చారని, ఆయన హయాంలో ఆడపిల్లల చదువు కోసం కీలక నిర్ణయాలు తీసుకొని ఆడపిల్లలకు చదువు ఎంత ముఖ్యమనీ మహిళల్లో ధైర్యం నింపిన వ్యక్తి వాజ్ పేయ్ అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్రవంతి రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోళ్ళ లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతంకర్. లక్ష్మీ నారాయణ, మాజీ కార్పొరేటర్స్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే ఆలయంలో చోరీ

- చోరీ సొత్తును కొన్న వ్యాపారి పట్టివేత

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 25 : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని స్వయంభూ శంభుని గుడిలో పట్టపగలే ఓ దుండగుడు చోరీకి పాల్పడ్డాడు. ఆలయం గోడ దూకి లోనికి ప్రవేశించి గుడిలోని పూజ సామగ్రిని ఎత్తుకెల్లాడు. సాయంత్రం ఆలయ పూజారి అక్కడకు వచ్చి చూడగా పూజ సామాగ్రి కనిపించకపోవటంతో అవాక్కయ్యాడు. వెంటనే విషయాన్ని ఆలయ చైర్మన్ బింగి మధుకు సమాచారం ఇవ్వటంతో ఆయన సంబంధిత రెండోటౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై ముజాహిద్ ఘటన స్థలానికి చేరుకుని ఆలయ పరిసర ప్రాంతాల్లో గల సీసీ కెమెరాలు పరిశీలించగా దుండగుడు ఆలయం గోడ దూకి లోపలికి వెళ్లి చోరీ చేసిన అనంతరం తిరిగి వెళ్లే దృశ్యాలన్నీ సీసీ కెమెరాలు రికార్డు అయ్యాయి. సీసీ కెమెరాల ఆధారంగా ఆలయ పూజ సామాగ్రిని కొనుగోలు చేసిన వ్యాపారి ఆచూకీ తెలుసుకున్నారు. స్థానిక ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మిర్చి కాంపౌండ్ ప్రాంతంలో పాత సామాన్లు కొనుగోలు చేసే ఓ వ్యాపారి దొంగకు కేవలం రూ.200 ముట్టజెప్పి పూజ సామగ్రిని తీసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ చోరీ ఘటనపై ఆలయ పూజారి రాజ్ కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో టౌన్ ఎస్ఐ సయ్యద్ ముజాహిద్ కేసు నమోదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజ్ ల ఆధారంగా ఆలయంలో చోరీకి పాల్పడిన దుండగుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

జిల్లాలో ఘనంగా క్రిస్టమస్ వేడుకలు

ప్రతిపక్షం, మంచిర్యాల, డిసెంబర్ 25: మంచిర్యాల జిల్లాలో గురువారం క్రిస్టమస్ వేడుకలను ఘనంగా జరిపారు ఈ సందర్భంగా మంచిర్యాల ఎమ్మెల్యే సతీమణి మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ క్రిస్టమస్ వేడుకలో పాల్గొని సంబరాలు జరిపారు .చిన్నారులతో కేక్ కట్ చేసి వేడుకలలో పాలుపంచుకున్నారు పట్టణంలోని గోపాల్ వాడలో గల సిఎస్ఐ చర్చి ఎసిసిలోని చర్చి లక్షట్ పేట చర్చిలలో ప్రార్థన నిర్వహించి అందరికీ అభివాదం తెలియజేశారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆరోగ్యం కుదుటపడాలని ఈ సందర్భంగా చర్చి ఫాదర్లు ప్రత్యేకమైన ప్రార్థనలు నిర్వహించారు. అదేవిధంగా గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ సోమ గూడెం చర్చిలో క్రిస్టమస్ సందర్భంగా పాల్గొని భక్తులకు అభివాదం తెలియజేశారు..

జిల్లాలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, డిసెంబర్ 25: జిల్లాలో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జిల్లా లోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్స్వాడ, జుక్కల్ నియోజకవర్గ ప్రజలు వేడుకల్లో పాల్గొన్నారు. ఏసుప్రభు జీవితం ప్రపంచంలోనే అందరికీ ఆదర్శప్రాయమని, భారతదేశం భిన్నత్వంలో ఏకత్వంగా అన్ని మతాలకు సమానంగా చూడడం జరుగుతుందనీ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని సిఎస్ఐ చర్చిలో క్రిస్మస్ పండుగ సందర్భంగా నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి అగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ తో పాటు కమిటీ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక ప్రార్థనలు చేపట్టి పోచారం శ్రీనివాస్ రెడ్డి తో పాటు కాసుల బాలరాజులకు ప్రజాప్రతినిధులకు ఆశీర్వాదం అందజేశారు. చర్చిలో కమిటీ సభ్యులతో కలిసి పోచారం శ్రీనివాస్ రెడ్డి కాసుల బాలరాజులు కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి కాసుల బాలరాజులు మాట్లాడుతూ భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం అని హిందూ ముస్లిం క్రిస్టియన్ సిక్కు వంటి ఎలాంటి మత విద్వాషాలు లేవని అన్ని మతాలు సమానమని భారతదేశం అందుకు ఆదర్శమని వారు పేర్కొన్నారు. ఏసు ప్రభు ప్రపంచ దేశాలకే ఆయన జీవితం ఆదర్శమనారు. మానవాళిలో ఆనందం నింపిన ఏసుప్రభు పండగ సందర్భంగా ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఏసు ప్రభు ఆశీర్వాదం అందరిపై ఉండాలని వారు అన్నారు. చర్చి ఫాదర్ చర్చిలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కావాలని కోరడంతో వెంటనే స్పందించిన పోచారం చర్చి ఫాదర్ కోసం రూపాయలు 10 లక్షలు ఇంటి నిర్మాణం కోసం మంజూరు చేశారు.

ఎల్లయ్య చెరువు అభివృద్ధికి ₹3.15 కోట్లు

ప్రతిపక్షం, బాన్సువాడ, డిసెంబర్ 25: బాన్సువాడ పట్టణంలో 3 కోట్ల 15 లక్షల రూపాయలతో ఎల్లారు (ఎల్లయ్య) చెరువు సుందరీకరణ పనులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాలరాజు భూమి పూజ చేశారు. ఎల్లారు (ఎల్లయ్య) చెరువును అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా మారాలని, చెరువు చుట్టు పక్కన గల కాలనీ వాసులకు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేవిధంగా, ఒక ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలాగా ఏర్పాటు చేయడం కోసం,ఈ చెరువు సుధారీకరణ పనులకు భూమి పూజ చేసుకున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

స్వగ్రామాభివృద్ధికి సహకారం అందిస్తా

- గ్రామానికి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయిస్తా
- పద్మనాభస్వామి ఆలయ నిర్మాణానికి సహకరిస్తా
- నార్కోటిక్స్ ఎస్పీ (ఈగల్ టీం) రావుల గిరిధర్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 25: తాను పుట్టిన స్వగ్రామం పాత నుస్తులాపూర్ తో పాటుగా ఇందిరానగర్, రామక్రిష్ణ కాలనీ గ్రామాలకు తనవంతుగా సహకారం అందిస్తా, అందరి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని నార్కోటిక్స్ ఎస్పీ (ఈగల్ టీం) రావుల గిరిధర్ తెలిపారు. తన సతీమణి చైల్డ్ రైట్స్ కమీషన్ మెంబర్ అపర్ణ తో కలిసి నుస్తులాపూర్ రెవెన్యూ గ్రామం రామకృష్ణకాలనీ గ్రామ పంచాయతీ పరిధిలోని అనంతపద్మనాభస్వామి ఆలయ స్థలాన్ని, అసంపూర్తిగా ఉన్న ఆలయ నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ గుజ్జుల శ్వేత, స్థానిక నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన పాలకవర్గంతోపాటు గ్రామస్తులందరూ సహకారం అందించాలని కోరారు. రాజీవ్ రహదారి పక్కనే ఉన్న ఆలయ స్థలంలో అనంతపద్మనాభ స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామస్తులందరితో పాటు తాను కూడా దాతల సహకారంతో కృషి చేస్తానని తెలిపారు.ఆలయ స్థలానికి సంబంధించిన అన్నీ పత్రాలను ఎండోమెంట్ ఆఫీసులో సమర్పించి అనుమతులు తీసుకుని పనులు ప్రారంబించేందుకు ఏర్పాట్లు చేసుకుందామని గ్రామస్తులతో పేర్కొన్నారు. తిరువనంతపురంలో మాదిరిగా ఆలయ నిర్మాణం చేపడితే భాగుంటుందని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.విలువైన ఆలయ స్థలం అన్యాక్రాంతం కాకుండా చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. తాను నుస్తులాపూర్, రామకృష్ణకాలనీ గ్రామాలకు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకారం అందిస్తానని సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలని గ్రామస్తులను కోరారు. గ్రామాల్లో ఇంటింటా సోలార్ పవర్, ఇంకుడు గుంతలు, వర్మీకంపోస్టు ఎరువుల తయారీకి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్ శ్వేతప్రణీత్ రెడ్డి తోపాటు వార్డు సభ్యులను ఎస్పీ దంపతులు సన్మానించారు.అనంతరం ఎస్పీ దంపతులను సర్పంచ్, వార్డు సభ్యులు,పలువురు న్యాయవాదులు, గ్రామస్తులు సన్మానించారు. ఆయన వెంట సర్పంచ్ తోపాటు మాజీ సర్పంచ్ లు రావుల రమేష్,గుజ్జుల రవీంధర రెడ్డి,కిన్నెర సారయ్య, నాయకులు సుగుర్తి జగదీశ్వరా చారి, కొమ్మెర మల్లారెడ్డి,దావు సంపత్ రెడ్డి,రావుల జీవన్,వేల్పుల ఓదయ్య,దావు శ్రీనివాస రెడ్డి,ఎదులాపురం సత్యం,నూనె సురేష్, వంగాల శ్రీనివాస్ రెడ్డి, బాల్ రెడ్డి,బాలస్వామి,శేఖర్ రెడ్డి, బోళ్ల శంకర్, న్యాయవాదులు గుజ్జ సతీష్,కటకం శ్రవణ్ కుమార్,సిరికొండ శ్రీధర్ రావు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పెండోట అనంతచారి, కొండపాక ప్రభాకర్, కర్ణకంటి తిరుపతి, సుగుర్తి బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.స్వగ్రామ పర్యటన కు వచ్చిన ఎస్పీ ని స్థానిక ఎస్ ఐ శ్రీకాంత్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఢిల్లీ టూర్‌లో మానకొండూరు జడ్పీ విద్యార్థులు

- భోజన, వసతి, రవాణా సౌకర్యం కల్పించిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- తొలిరోజు ఇండియా గేట్, ఎర్రకోట, అక్షర ధామ్ ను సందర్శించిన విద్యార్థులు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 25: నాలుగు రోజుల ఢిల్లీ-మథుర-ఆగ్రా పర్యటనలో భాగంగా కరీంనగర్ జిల్లా మానకొండూరులోని పీఎంశ్రీ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థులు ఈరోజు ఢిల్లీకి చేరుకున్నారు. వీరందరికీ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తన అధికారిక నివాసంలో భోజన, వసతి సౌకర్యం కల్పించారు. ప్రత్యేకంగా రవాణ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. తొలిరోజు ఆయా విద్యార్థులంతా ఢిల్లీలోని ఇండియా గేట్, నేషనల్ పోలీస్ మెమోరియల్, ఎర్రకోట, రాజ్ ఘాట్, బిర్లా మందిర్, అక్షర్ ధామ్ ఆలయం, నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్ మరియు సెంట్రల్ సెక్రటేరియట్లను సందర్శించారు. రేపు(శుక్రవారం) భారత పార్లమెంట్, ప్రధానమంత్రుల సంగ్రహాలయం (పీఎం సంగ్రహాలయ)ను సందర్శించనున్నారు. అనంతరం హుమాయున్ సమాధి, సఫ్దర్‌జంగ్ సమాధి, పురానా ఖిల్లా, కుతుబ్ మినార్ వంటి ప్రముఖ చారిత్రక కట్టడాలను వీక్షించి భారతదేశ చరిత్ర, శిల్పకళపై అవగాహన పెంచుకోనున్నారు. ఎల్లుండి (డిసెంబర్ 27న) మథుర లోని శ్రీ కృష్ణ జన్మస్థలాన్ని సందర్శించి అనంతరం ఆగ్రాలో పర్యటిస్తారు. అదే రోజు సాయంత్రం దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ ద్వారా జమ్మికుంటకు తిరుగు ప్రయాణం అవుతారు. ఈ పర్యటన ద్వారా విద్యార్థులకు జాతీయ స్థాయి సంస్థలు, చారిత్రక కట్టడాలు, భారతదేశ సాంస్కృతిక వారసత్వంపై విలువైన అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో మానకొండూరు స్కూల్ అధ్యాపకులు ఈ టూర్ ను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఆయా విద్యార్థులు ఢిల్లీ చేరుకున్నప్పటి నుండి వివిధ ప్రాంతాల సందర్శన పూర్తయ్యే వరకు వారికి అవసరమైన భోజన, వసతి, రవాణా సౌకర్యాలను కేంద్ర మంత్రి బండి సంజయ్ కల్పిస్తున్నారు.

పెద మహిళకు ఆపరేషన్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 25: పెద్దపల్లి జిల్లాలో బ్రాహ్మణ పల్లి గ్రామానికి చెందిన 40 సంవత్సరాల ఒక మహిళలకు గత కొంతకాలంగా అండాశయంలో గడ్డలతో బాధపడుతూ ఉంది. అయితే సదరు మహిళ ట్రీట్మెంట్ కోసం పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ మానవతా దృక్పథంతో, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ ని కలిసి మన ప్రభుత్వ ఆసుపత్రిలో సదరు మహిళకు ట్రీట్మెంట్ ఇవ్వాలని కోరారు. వెంటనే ఆ మహిళను పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకోకున్నారు. కానీ ఇది వరకు ఈమెకు 4 పెద్ద ఆపరేషన్లు జరిగాయి. దీని వల్ల చేయబోయే ఆపరేషన్ క్లిష్ట తరంగ ఉంటుంది. కావున సదరు పేషెంట్ కి ఈ రోజు అన్ని జాగ్రత్తలు తీసుకొని డాక్టర్ అనసూయ, గైనకాలజిస్ట్ డా శ్రీధర్ ఆపరేషన్ ను విజయవంతంగా నిర్వహించి ఆ గడ్డలను తొలంగించారు. ఈ సర్జరీ లో పాల్గొన్న వైద్యుల బృందం డాక్టర్ అనసూయ డాక్టర్ రామం లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా ప్రజలందరూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల క్లిష్టమైన శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. కావున ప్రజలు ఈ సేవలను ఉపయోగించుకోగలరని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.



వైద్యరంగంలో పీపీపీ విధానంతో మేలు జరుగుతుంది. పైలెట్ ప్రాజెక్టు వ్యయంలో 80%, 5 ఏళ్లపాటు నిర్వహణ వ్యయంలో 50% వయబిలిటీ గ్యాప్ ఫండ్ కింద అందుతుంది. మొత్తంగా 40%వరకు కేంద్ర సాయం ఉంటుంది. మౌలిక వసతులు భారీగా సమకూరుతాయి. సేవల నాణ్యత, పారదర్శకత పెరుగుతుంది.

- కేంద్ర మంత్రి నడ్డా

ప్రాంతీయం

బాలికల వసతి గృహానికి దుప్పట్ల పంపిణీ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 25: సిటిజన్స్ క్లబ్ సిద్దిపేట వారి ఆధ్వర్యంలో సిద్దిపేట మంగమ్మ తోటలో ఉన్న బాలికల వసతి గృహంలో శుక్రవారం దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో నివసిస్తున్న సుమారు 160 మంది విద్యార్థినులకు 160 దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్లబ్ సీనియర్ జీవిత సభ్యుడు సురేందర్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో సిటిజన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం.ఎస్. రమేశ్, సెక్రటరీ బోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చెందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, క్యాషియర్ చందా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే ఈసీ మెంబర్లు సూర్యప్రకాశ్, శ్రీకాంత్ లు పాల్గొని విద్యార్థినులకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ నాయకులు మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో వసతి గృహ సిబ్బంది సహకారం అందించారు.

ఘనంగా అటల్ బిహారీ వాజపేయి జయంతి

ప్రతిపక్షం, దుబ్బాక, డిసెంబర్ 25: దేశ మాజీ ప్రధాని,భారతరత్న ,అటల్ బిహారీ వాజపేయి 101 వ జయంతి వేడుకలు దుబ్బాక పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఆయన ఆశయ సాధనకు ప్రతి బి జే పి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక అసెంబ్లీ బి జే పి కన్వీనర్ ఎస్ ఎన్ చారి, బిజెపిపట్టణ అధ్యక్షుడు శ్రీ కాంత్ యాదవ్, మండల అధ్యక్షుడు మంద అనిల్ రెడ్డి , సీనియర్ నాయకులు గాజుల భాస్కర్, అంబటి శివప్రసాద్, యాదవ రెడ్డి, పల్లె నేహాల్ గౌడ్, భరత్ చారి , నవీన్, నరసింహా రాజు, చాకలి రాజు, బైండ్ల నారాయణ తది తరులు పాల్గొన్నారు.

ప్రేమ, శాంతి సౌభ్రాతృత్వా నికి ప్రతీక క్రిస్మస్ పండగ

ప్రతిపక్షం, దుబ్బాక, డిసెంబర్ 25: ప్రేమ,శాంతి, సౌభ్రాతృత్వా నికి ప్రతీక క్రిస్ మస్ పండగ అని రాష్ట్ర బి ఆర్ ఎస్ నాయకు రాలు కత్తి కార్తీక గౌడ్ అన్నారు. గురువారం దుబ్బాక మండలం గంభీర్‌పూర్ గ్రామంలో స్థానిక చర్చ్ లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ పండుగవేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ రాజు ,క్రైస్తవ సంఘ నాయకులు, వివిధ పార్టీల నాయకులు, తది తరులు పాల్గొన్నారు.

మెదక్ చర్చ్‌లో బందోబస్తును పరిశీలించిన ఎస్పీ

ప్రతిపక్షం,మెదక్ టౌన్, డిసెంబర్ 25: ప్రసిద్ధ మెదక్ చర్చ్ వద్ద క్రిస్మస్ సందర్భంగా ఏర్పాటు చేసిన బందోబస్తును గురువారం జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు స్వయంగా పరిశీలించారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు చర్చ్‌కు తరలివచ్చే అవకాశం ఉన్నందున, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామని వెల్లడించారు. ఎక్కడ ఇబ్బంది లేకుండా భక్తులు చర్చి సందర్శించి వెళ్లేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా చర్చ్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను సమీక్షించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. పండుగ వాతావరణంలో ప్రజలు శాంతియుతంగా వేడుకలు నిర్వహించుకునేందుకు పోలీస్ శాఖకు పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. వీరితోపాటు పాటు అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, రంగా నాయక్, సీఐలు రాజశేఖర్ రెడ్డి, మహేష్, సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, రంగకృష్ణ, అలాగే ఎస్సైలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు. మెదక్ చర్చ్‌లో పాస్టర్ శాంతయ్య నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు పాల్గొన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని శాంతి, సౌభ్రాతృత్వం, సమాజ హితం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఆ ఆదర్శాలను ఆచరిస్తూ మత సామరస్యాన్ని కాపాడుతూ శాంతియుత జీవనం సాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ శాంతయ్య ఎస్పిని శాలువాతో సన్మానించారు. అనంతరం చర్చ్ ప్రాంగణంలో భక్తులతో సాదరంగా ముచ్చటించి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రిస్మస్ వేడుకల్లో నార్సింగి సర్పంచుకు సన్మానం

ప్రతిపక్షం, చేగుంట, డిసెంబర్ 25: నార్సింగ్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఆకుల సుజాత మల్లేష్ గౌడ్ దంపతులను బాప్టిస్ట్ చర్చ్ పాస్టర్ రూబెన్ ఘనంగా సన్మానించారు. అనంతరం ఫాస్టర్ సోల్మాన్ రాజ్ దంపతులు సుజాత మల్లేశం గౌడ్ దంపతులను ఘనంగా సన్మానించారు. వివిధ ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని సర్పంచ్ ఆకుల సుజాత మల్లేశం గౌడ్ దంపతులు ఆకాంక్షించారు. ఏసుక్రీస్తు నామస్మరణతో క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్నారని కొనియాడారు. గ్రామాభివృద్ధి కోసం సమిష్టిగా అన్ని వర్గాల కలయికతో కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. నార్సింగి మండల కేంద్రాన్ని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యం అన్నారు.

డిసెంబర్ 30 నుంచి ఆరంభమయ్యే వైకుంఠ ద్వార దర్శనాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. ప్రస్తుతం రోజుకు 4 లక్షల లడ్డూలు, 8వేల కళ్యాణోత్సవ లడ్డూలను భక్తులకు విక్రయిస్తున్నాం. వైకుంఠ ద్వార దర్శనాల సమయంలో వీటి తయారీని పెంచుతాం. లడ్డూల నాణ్యత, రుచి పెంచాం, క్యూలైన్లలో నిరీక్షణ తగ్గించాం.
- టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే

గ్రామీణ ప్రజల ఆర్థిక అభివృద్ధి జరగాలి

- పి.సుగుణాకర రావు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 25: కిసాన్ జాగరణ్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహిస్తున్న 'కిసాన్ గ్రామీణ మేళా' రెండవ రోజు కార్యక్రమాలు అత్యంత ఉత్సాహంగా,కొనసాగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు రైతులు పాటించాల్సిన ఆధునిక సాగు పద్ధతులు, ఆదాయ వృద్ధి మార్గాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కిసాన్ జాగరణ్ అధ్యక్షులు, మేళా నిర్వాహకులు శ్రీ పి. సుగుణాకర్ రావు మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎల్ఎండీ, మిడ్ మానేరు, ఎగువ మానేరు, కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులతో నేడు ఒక 'వాటర్ జంక్షన్ (జల కూడలి)'గా రూపాంతరం చెందిందని తెలిపారు. సమృద్ధిగా నీటి వనరులు ఉన్న ఈ ప్రాంతంలో రైతులు కేవలం వరి పంటకే పరిమితం కాకుండా, చేపలు, రొయ్యల పెంపకం వంటి లాభసాటి రంగాల వైపు దృష్టి సారించాలని సూచించారు. భవిష్యత్తులో ఇక్కడి నుంచే విదేశాలకు చేపలు, రొయ్యలు ఎగుమతి చేసే స్థాయికి రైతులు ఎదగాలని ఆకాంక్షించారు.ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ఎల్. జలపతిరావు మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడులు సాధించడమే కాకుండా పంట మార్పిడి విధానాలు అనుసరించాలన్నారు. ముఖ్యంగా ఎఫ్‌పీఓలు ద్వారా సంఘటితమై, పంటల ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ బాధ్యతలను రైతులే స్వయంగా నిర్వహించినప్పుడే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని స్పష్టం చేశారు. ప్రముఖ వ్యవసాయ నిపుణులు, స్వామినాథన్ శిష్యులు శ్రీ వెంకటేశ్వర్లు గారు రైతాంగం ఎదుర్కొంటున్న ప్రస్తుత సమస్యలు, వాటికి సాధ్యమైన పరిష్కార మార్గాలపై సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించి రైతులకు అంకితమిచ్చారు.

కబడ్డీ పోటీల్లో జిల్లా సత్తా చాటాలి

- జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్

ప్రతిపక్షం, గజ్వేల్, డిసెంబర్ 25: నేటి నుంచి కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న సీనియర్ కబడ్డీ పోటీల్లో సిద్దిపేట జిల్లా మహిళా కబడ్డీ జట్టు మొదటి స్థానంలో నిలిచి జిల్లా పేరును చిరస్థాయిగా నిలుపాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. సి సంతోష్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన కరీంనగర్ లో నిర్వహిస్తున్న సీనియర్ కబడ్డీ స్టేట్ పోటీలలో భాగంగా సిద్దిపేట జిల్లా మహిళా కబడ్డీ టీం సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ శివ కుమార్,కోచ్ శిరీష రెడ్డి, మేనేజర్ లోకేశ్వరి, అసోసియేషన్ నెంబర్ మహేష్, సామాజిక కార్యకర్త సుధాకర్ కబడ్డి క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ప్రధాని వాజ్ పేయి జయంతి వేడుకలు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 25: దేశ మాజీ ప్రధాని వాజ్ పేయి జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. వాజ్ పేయి 101వ జయంతిని పురస్కరించుకుని గురువారం మెదక్ జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా శాఖ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్ పేయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా దేశానికి వాజ్ పేయి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు .ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఇంచార్జ్ మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్,మెదక్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి పట్టణ అధ్యక్షుడు నాయిని.ప్రసాద్ ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శిలు యం. యల్. యన్. రెడ్డి, నల్లల విజయ్,మెదక్ జిల్లా సీనియర్ నాయకులు లోకేష్ వేణు వడ్ల జనార్ధన్ ,అల్లం మధు , మనోజ్, సుంకోజి రాజు,ఆఫీస్ సెక్రటరీ సాయి కిరణ్ ధ్యాన్సింగ్, షేర్ సింగ్ పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధి కి కలిసిపని చేయండి

- బీఆర్ఎస్ పార్టీలో చేరిన తడక పల్లి గ్రామ ఉప సర్పంచ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 25: సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లి గ్రామ ఉపసర్పంచ్ నరేందర్ మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మాట్లాడుతు బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకున్నమని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేసుకుందామని చెప్పారు.కలసి కట్టుగా ఐక్యత గా ఉండండి అభివృద్ధి చేసే బాధ్యత నాదని హరీష్ రావు అన్నారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ తో పాటు పలువురు పార్టీ లో చేరారు వారికి కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.

ప్రేమ, సేవ, క్షమా గుణాలే యేసు క్రీస్తు సందేశం

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు
- సిద్దిపేట సిఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, డిసెంబర్ 25: యేసు క్రీస్తు ప్రేమ, సేవ, క్షమా గుణాలను ప్రపంచానికి బోధించారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు.క్రిస్మస్ పర్వదినం సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని సిఎస్ఐ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలు, వేడుకల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రైస్తవ సోదరసోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ప్రతి ఏడాది ఆనవాయితీగా క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటున్నట్లు హరీష్ రావు తెలిపారు. ఈ పవిత్ర మాసంలో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది క్రైస్తవులు క్రిస్మస్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని అన్నారు. ప్రేమ, సేవ, క్షమా గుణాలను ప్రపంచానికి బోధించిన యేసు క్రీస్తు జన్మదినం క్రైస్తవులకు అత్యంత సంతోషకరమైన రోజని పేర్కొన్నారు. యేసుక్రీస్తు దీవెనలు ప్రతి ఒక్కరికీ లభించి, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అలాగే గతంలో కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వ హయాంలో క్రిస్మస్ సందర్భంగా రెండు రోజుల సెలవులు ప్రకటించారని గుర్తు చేశారు. కేసీఆర్ అన్ని మతాలను సమానంగా గౌరవించారని, క్రిస్మస్ కిట్లు, బతుకమ్మ చీరలు, రంజాన్ తోపా వంటి కార్యక్రమాలను అమలు చేశారని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం క్రిస్మస్ కిట్లు అందించడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో చర్చి పెద్దలు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సుపరిపాలనకు ఆద్యుడు అటల్ జీ!

- వికసిత భారత్‌కు మోదీ జీ!

ప్రతిపక్షం, గజ్వేల్, డిసెంబర్ 25: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి జయంతి పురస్కరించుకొని గజ్వేల్ పట్టణ కేంద్రంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్ అధ్యక్షతన గజ్వేల్ పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్ సీనియర్ నాయకులు యేల్లు రాం రెడ్డి, ఉప్పల మధు మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్య రూపురేఖలను తన మాటలతో, అత్యున్నత నడవడికతో తీర్చి దిద్దిన మహోన్నత రాజనీతిజ్ఞుడు మాజీ ప్రధాని వాజ్‌పేయి అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం వర్ధిల్లేది 'సంవాదం'తోనే కానీ 'వివాదం'తో కాదని, ప్రభుత్వాలు వస్తాయి పోతాయి కానీ దేశం మాత్రం శాశ్వతంగా నిలిచి ఉండాలని నమ్మిన వ్యక్తి అటల్ జి అన్నారు. రాజకీయం అంటే అధికారం కోసం చేసే పరుగు పందెం కాదు, అదొక సేవా యజ్ఞం అని రాజకీయాల్లో ఆయన పాటించిన హుందాతనం, అందరినీ కలుపుకుపోయే తత్వం, దేశమే ప్రథమం అనే ఆయన సిద్ధాంతం భావితరాలకు స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కుడిక్యాల రాములు, నత్తి శివకుమార్, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్లు నాయిని సందీప్ కుమార్, మాదుగురి నరసింహా ముదిరాజ్ , బిజెపి నాయకులు పేద్యల శ్రీనివాస్, వడ్డేపల్లి ప్రసాద్, ఏగోండ, నీరజా, సుమతి, మంది వేంకట్, పవన్ కుమార్, కిష్ట గౌడ్, కాశమైన సందీప్ కుమార్, కాశమైన రమేష్, దయాకర్ రెడ్డి, వేణు గోపాల్ రాజు, గడియారం రాజేశ్వర్ చారి, మమత, సరిత, భక్తి మాల, లక్ష్మీ, బాల్ రాజు, సందిరి రాజు పాల్గొన్నారు.

ఆర్టికల్ 370 రద్దుతో శ్యామ్‌ప్రసాద్ కల సాకారం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 25: ఆర్టికల్ 370 రద్దుతో శ్యామ్‌ప్రసాద్ కల సాకారం చేశామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. జమ్మూకాశ్మీర్‌లో భారత రాజ్యాంగం అమలు చేశామని చెప్పారు. గురువారం ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగిన భారతరత్న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి 101వ జయంతి కార్యక్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ మధ్యాహ్నం సుమారు 2:30 గంటలకు ఆయన గోమ్తీ నది ఒడ్డున నిర్మించిన రాష్ట్ర ప్రేరణా స్థల్‌ను జాతికి అంకితం చేశారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ..'కోట్లాదిమందిని పేదరికం నుంచి విముక్తి చేశాం. గతంలో ఒకే కుటుంబం పేరుతో పథకాలు అమలుచేశారు. వాజ్‌పేయి హయాంలోనే గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి బీజం పడింది. 2014 నుంచి గ్రామాల్లో 4 లక్షల కి.మీ. రోడ్ల నిర్మాణం జరిగింది. దేశంలో ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణం మరింత పుంజుకుంది. వాజ్‌పేయి హయాంలోనే ఢిల్లీ మెట్రో ప్రారంభమైంది. భవిష్యత్‌లో అతిపెద్ద మొబైల్ ఫోన్ల ఉత్పత్తి దేశంగా భారత్ మారనుంది. అందరి కృషితోనే వికసిత్ భారత్ సాకారం అవుతుంది. లక్నోలో అతిపెద్ద డిఫెన్స్ కారిడార్ ఉంది. బ్రహ్మోస్ క్షిపణులు లక్నోలోనే తయారవుతున్నాయి. మన బ్రహ్మోస్ క్షిపణుల సామర్థ్యం ప్రపంచమంతా చూసింది. మొబైల్, ఇంటర్నెట్ వినియోగించే దేశాల్లో భారత్‌దే అగ్రస్థానం' అని అన్నారు. కాగా, సుమారు 65 ఎకరాల విస్తీర్ణంలో 230 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మితమైన రాష్ట్ర ప్రేరణా స్థల్ జాతీయ స్మారక సముదాయంలో అటల్ బిహారీ వాజ్‌పేయితో పాటు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయల ఆదర్శాలకు అనుగుణంగా వారి విగ్రహాలు ఏర్పాటు చేశారు.

విశ్వ వీక్షణం

అజ్ఞాతాన్ని వీడిన ఖలీదా జియా కుమారుడు

- తారీఖ్ కు ఢాకాలో ఘన స్వాగతం

ఢాకా, డిసెంబర్ 25: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు, బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ(బీఎన్‌పీ)కి కాబోయే అధినేత తారీఖ్ రహ్మాన్ 17 ఏళ్ల స్వీయ అజ్ఞాతవాసాన్ని వీడి గురువారం ఢాకా చేరుకున్నారు. ఢాకా విమానాశ్రయం వద్ద ఆయనకు పార్టీ కార్యకర్తల నుంచి ఘన స్వాగతం లభించింది. భార్య, కుమార్తెతో కలసి ఢాకా చేరుకున్న తారీఖ్ రహమాన్ గట్టి భద్రతా ఏర్పాట్ల మధ్య తన నివాసానికి కాన్వాయ్‌లో బయల్దేరారు. ఈ సందర్భంగా పార్టీ మద్దతుదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. మెరుగైన బంగ్లాదేశ్ నిర్మించేందుకు తన వద్ద ప్లాన్ ఉందని చెప్పారు. 2006 నుంచి 2008 మధ్య సైన్యం మద్దతుతో నడిచిన ప్రభుత్వ హయాంలో రహ్మాన్‌ను అరెస్టు చేసిన పోలీసులు కస్టడీలో ఆయనను చిత్రహింసలు పెట్టారు. తీవ్ర గాయాలపాలైన రహ్మాన్ ప్రభుత్వ అనుమతితో 2008లో చికిత్స నిమిత్తం లండన్‌కు పయనమయ్యారు. బంగ్లాదేశ్‌లోని రెండు ప్రధాన రాజకీయ పార్టీలలో ఒకటైన బీఎన్‌పీకి యాక్టింగ్ చైర్మన్‌గా రహ్మాన్ వ్యవహరిస్తున్నారు. ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రహ్మాన్ 17 ఏండ్ల అజ్ఞాతవాసం తర్వాత దేశానికి తిరిగి రావడం దేశ రాజకీయాలలో ప్రాధాన్యతను సంతరించుకుంది. గత ఏడాది దేశం నుంచి పారిపోయిన మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందిన నేపథ్యంలో మొదటిసారి దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. షేక్ హసీనా నాయకత్వంలోని ఆవామీ లీగ్ ఎన్నికల్లో పాల్గొనకుండా ఆపద్ధర్మ ప్రభుత్వం నిషేధం విధించడంతో ఎన్నికల బరిలో బీఎన్‌పీ ఏకైక ప్రధాన పక్షం కానున్నది. మెజారిటీ లభిస్తే రహ్మాన్ ప్రధాని అయ్యే అవకాశాలు ఉన్నాయి.

సింగిడి
హైదరాబాద్
శుక్రవారం
26.12.2025

ప్రతిపక్షం
Prathipaksham.in



ఘనంగా క్రిస్మస్ వేడుకలు

భక్తజన సంద్రమైన మెదక్ సీఎస్ఐ చర్చ్

ప్రతిపక్ష ప్రతినిధి, మెదక్

ఆసియా ఖండంలోనే అతి పెద్ద రెండవ చర్చిగా పేరుగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆరాధనలో చర్చి కార్యాలయం నుండి శిలువను చర్చి మాడియేటర్ బిషప్ పాస్టర్లందరూ కలిసి ఊరేగింపుగా తీసుకువచ్చి చర్చిలో ప్రతిష్టించారు. అనంతరం చర్చిలో ఏసుక్రీస్తు పుట్టిన నేపథ్యం అయినా ప్రజలకు సేవ చేసిన నేపథ్యాన్ని పాటల రూపంలో పాడుతూ ఆరాధన మొదలయింది. ఒక్కో సమయంలో ఒక్కో రంగు సంతరించుకునేలా వెలుగుల దీపాలు అద్దడంతో చర్చి ప్రాంగణం శోభాయమానంగా మారింది. దక్షిణ భారత మోడరేటర్ చర్చి రెవ. డాక్టర్ కె. రూబెన్ మార్క్ దైవ సందేశాన్ని ఇస్తూ ..దక్షిణ ఇండియా సంఘం, మెదక్ అధ్యక్ష మండలం సంఘం తరపున క్రైస్తవ సోదరులకు బిషప్ ఏసుక్రీస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. లోకంలో ఏసుక్రీస్తు జన్మదినం జరుపని దేశమంటూ ఉండదని అన్ని దేశాలు ఆయన లోక రక్షకుడిగా భావించి ఆయన జన్మదినాన్ని జరుపుకుంటారని బిషప్ దైవ వాక్యాన్ని అందించారు. ప్రపంచమంతా శాంతియుతంగా ఉండాలని మనిషి దైవ చిత్తం కలిగిన నాడే మహనీయుడు అవుతాడని ఏసుక్రీస్తు దయవల్ల ప్రతి ఒక్కరు దైవచింతనా ఉండాలని ప్రేమ దయాగుణం ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.సుమారుగా 5 వేల మంది భక్తులు ప్రాతకాల ఆరాధనలో పాల్గొన్నారు..క్రిస్మస్ సందర్భంగా ఏసుక్రీస్తు జన్మవృత్తాంతాన్ని తెలియజేసేలా చర్చిలో ప్రధాన వేదిక ముందు సంప్రదాయ పద్ధతిలో పశువుల పాక ఏర్పాటుచేసి దానికి స్టార్ వేలాడదీశారు. మరో పక్కన పెద్ద సైజు క్రిస్మస్ ట్రీని ఏర్పాటుచేసి దానిని శాంత క్లాజ్ బొమ్మలను, బెల్స్, స్టార్స్, గ్రీటింగ్ కార్డ్స్‌రంగురంగుల బాల్స్‌తో అందంగా అలంకరించారు .చర్చిలోని విశాలమైన హాలును రంగురంగుల మెరుపు కాగితాలు, బెలూన్‌లు, స్టార్‌లతో శోభాయమానంగా అలంకరించారు. ఈ మేరకు సి ఎస్ ఐ యంత్రాంగం భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసింది,జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 500 మంది పోలీసులతో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తులతో కిటకిటలాడిన చర్చి ప్రాగణం

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్,కర్నాటక, మహారాష్ట్రల.నుండి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో చర్చి ప్రాగణం కిటకిటలాడింది. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 500 మంది పోలీసులతో భారీ భస్తును ఏర్పాటు చేయడం జరిగింది. చర్చి ప్రాగణం మొత్తం సీసీ కెమెరా ఏర్పాటు చేయడం. జరిగింది చర్చిలో రెండు ఆరాధనలు పాల్గొన్న అనంతరం మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు పెద్ద ఎత్తున భక్తులు రావడంతో చర్చి ప్రాగణం కిటికీటలాడింది.

కాంగ్రెస్ ప్రభుత్వం లోనే
చర్చికి అభివృద్ధి నిధులు: మైనంపల్లి

తెలంగాణలోనే అతిపెద్ద చర్చి అయినా మెదక్ సీఎస్ఐ చర్చికి భక్తులు అధిక సంఖ్యలో రావడం జరుగుతుందని భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని గత పది సంవత్సరాల కాలంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయా పైసా ఇవ్వలేదని. కొద్ది సంవత్సరాల కాలంలో ఎట్టి అభివృద్ధి జరగలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రితో మాట్లాడి చర్చి అభివృద్ధికి 28 కోట్ల రూపాయలు ఇవ్వడం జరిగిందని కాంగ్రెస్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో మెదక్ చర్చి రావడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. అనంతరం మెదక్ చర్చిలో మైనంపల్లి హనుమంతరావు మెదక్ చర్చి నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. అనంతరం మైనంపల్లి హనుమంతరావు. భక్తుల మధ్య క్రిస్మస్ కేకులు కట్ చేసి ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంగాధర్. మేడి మధుసూదన్ రావు మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్. ముత్యం గౌడ్.ప్రవీణ్ గౌడ్.దయాసాగర్.లింగం. రాగి అశోక్. శ్రీనివాస్ చౌదరి. ఆఫీస్ మల్ సాబ్. బట్టి సులోచన.జ్యోతి. హరిత. విజయ లక్ష్మి.గంట సంపత్ భాను జయమమ్మారీ. తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన భారాస
జిల్లా అధ్యక్షురాలు: పద్మ దేవేందర్ రెడ్డి

క్రిస్మస్ పండుగ శాంతి, ప్రేమ,కరుణ త్యాగం మానవీయ విలువలకు ప్రతీక అని,యేసు చూపిన బాటలో అందరూ నడుచుకోవాలని మాజీ డిప్యూటీ స్పీకర్ మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం . పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం మెదక్ సీఎస్ఐ చర్చిలో ఇంచార్జి బిషప్ రైట్ రెవరెండ్ రూబెన్ మార్క్, పాస్టర్ శాంతయ్య ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ శేరి.సుభాష్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరెళ్ళ మల్లికార్జున్ గౌడ్ స్థానిక కౌన్సిలర్ జయరాజ్, నాయకులతో కలిసి పద్మ దేవేందర్ రెడ్డి. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన చర్చి మెదక్ ఉండడం మనందరికీ గర్వకారణం అన్నారు. శత్రువులను సైతం ప్రేమతో క్షమించాలని సూచించిన ప్రేమమూర్తి యేసు ప్రభువు అన్నారు. ప్రేమ, దయ, కరుణ, జాలి గుణాలతో జీవించాలని, ప్రభువు సూచించిన మార్గంలో నడుచుకుందామన్నారు. అనంతరం చర్చి పాస్టర్ శాంతయ్య ఆధ్వర్యంలో పద్మాదేవేందర్ రెడ్డి, శేరి.సుభాష్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా చర్చి ప్రాంగణంలోని ప్రధాన ద్వారం వద్ద పద్మాదేవేందర్రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసి పంచిపెట్టి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చర్చి సెక్రెటరీ గెలెన్, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు జయరాజ్,ఆర్కే. శ్రీనివాస్,విజయలక్ష్మి,మాయ మల్లేశం, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, కో కన్వీనర్లు కృష్ణ గౌడ్ లింగారెడ్డి, జుబేర్ అహ్మద్, నాయకులు ఏనుగుల.రాజు ,మహమ్మద్, లక్ష్మీనారాయణ, నర్సింలు, మోహన్ నాయక్, శ్రీనివాస్ గౌడ్, రుక్మాచారి,అనుప్,బబ్లు, కిరణ్, చాంద్ పాషా, భువన్ తదితరులు పాల్గొన్నారు.

రష్యాలో మన యువత సాఫ్ట్‌వేర్ జాబ్ వదిలి.. స్వీపర్లుగా

మాస్కో, డిసెంబర్ 25: పెద్ద కంపెనీల్లో ఉద్యోగం మానేసి రష్యాలో మన దేశానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు చీపురు చేతబట్టి రోడ్లు ఊడుస్తున్నారు. అదేంటని ఆశ్చర్యపోతున్నారా? మీరు చదివింది నిజమే. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగం కన్నా క్లీనర్‌గా చేస్తేనే ఎక్కువ జీతం వస్తున్నదని, అందుకే పని ఏదైతేనేం.. పైసలు ముఖ్యం అని వారు తెగేసి చెబుతున్నారు. రష్యాలో క్లీనర్ ఉద్యోగాలకు భారీగా కొరత ఉండటంతో పుతిన్ సర్కారు భారీగా వేతనాలు అందిస్తున్నది. వీధుల్లో చీపురుతో ఊడుస్తూ కన్పించిన 26 ఏండ్ల ముఖేశ్ మండల్‌ను మీడియా ప్రశ్నించగా, మైక్రోసాఫ్ట్ అనుబంధ సంస్థలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేస్తున్న తాను ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి స్వీపర్‌గా చేరానని తెలిపాడు. ఎందుకంటే స్వీపర్‌గా తనకు నెలకు రూ. 1.1 లక్షల జీతం వస్తున్నదని, ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తుండటంతో తన జీతమంతా మిగిలిపోతున్నదని తెలిపాడు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జీతం కన్నా ఇది ఎక్కువని పేర్కొన్నాడు. తనతో పాటు భారత్ నుంచి వచ్చిన 1943 ఏండ్ల వయసు గల 17 మంది కూడా ఇక్కడ క్లీనర్లుగానే పనిచేస్తున్నట్టు ఆయన వెల్లడించారు.

దేశ వ్యాప్తంగా గిగ్‌వర్కర్ల సమ్మె

- ఉద్యోగ, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్
- సమ్మెతో స్విగ్గీ, జొమాటో, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, జెప్టో,బ్లింకిట్ సేవల్లో తీవ్ర అంతరాయం..
- ఈ నెల 31న మరోసారి సమ్మెకు దిగనున్న గిగ్ వర్కర్లు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 25: ఉద్యోగ, సామాజిక భద్రత కల్పించాలంటూ దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్లు గురువారం సమ్మెకు దిగారు. దీంతో ఈకామర్స్, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, జెప్టో, బ్లింకిట్ , స్విగ్గీ, దాని అనుబంధ సంస్థ ఇన్‌స్టామార్ట్, జొమాటో తదితర యాప్ సేవల్లో తీవ్ర అంతరాయం నెలకొన్నది. క్రిస్మస్ పండుగ నాడు గిగ్ వర్కర్లు సమ్మెకు దిగడంతో తాము అవసరమైన పండుగ వస్తువులను కొనుగోలు చేయలేకపోయామని ఢిల్లీ, గురుగ్రామ్, ముంబై, తిరువనంతపురం, పనాజీ తదితర నగరాల్లోని పలువురు సోషల్‌మీడియా వేదికగా కామెంట్లు చేశారు. స్విగ్గీఇన్‌స్టామార్ట్, జెప్టో, బ్లింకిట్ లో తమ ఆర్డర్లను క్యాన్సిల్ చేసినట్టు మరికొందరు వాపోయారు. ఎలాంటి భద్రత లేకుండా రద్దీ రోడ్లపై డెడ్‌లైన్లతో పనిచేసే గిగ్ వర్కర్లకు ప్రమాద బీమా, ఆరోగ్య భద్రత కల్పించాలని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్‌బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ (ఐఎఫ్‌ఏటీడబ్ల్యూ) ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఒక్కో డెలివరీ మధ్య విశ్రాంతి సమయం ఇవ్వాలని, ప్రోత్సాహకాలు, కస్టమర్లు ఇచ్చే టిప్ డబ్బులు నేరుగా గిగ్ వర్కర్ ఖాతాలో జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. లేట్ డెలివరీలకు సహేతుక కారణం చూయించినప్పటికీ, పెనాల్టీ వేస్తున్నారని.. దాన్ని రద్దు చేయాలన్నారు. అన్నింటి కంటే ముఖ్యంగా 10 నిమిషాల డెలివరీ నిబంధనను ఎత్తివేయాలని పట్టుబట్టారు. ఈ నిబంధనతో డెడ్‌లైన్ లోపు డెలివరీ చేయాలన్న లక్ష్యంతో గిగ్‌వర్కర్లు ప్రమాదాలబారిన పడుతున్నట్టు గుర్తు చేశారు. పండుగలు, వేడుకల సమయంలో సమ్మెకు దిగితేనే.. తమ ఆందోళన గురించి ప్రభుత్వం పట్టించుకొంటుందని ఐఎఫ్‌ఏటీడబ్ల్యూ ప్రతినిధులు తెలిపారు. న్యూఇయర్ సందర్భంగా 31వ తేదీన మరోమారు సమ్మెకు దిగనున్నట్టు పేర్కొన్నారు.



మూడో టీ20కి రెడీ
సిరీస్ పైనే గురి

తిరువనంతపురం: శ్రీలంకతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌పై భారత మహిళల జట్టు గురిపెట్టింది. సిరీస్‌లో ఇప్పటికే 20 ఆధిక్యంలో ఉన్న హర్మన్‌ప్రీత్‌కౌర్ సారథ్యంలోని టీమ్‌ఇండియా మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సిరీస్ దక్కించుకోవాలని చూస్తున్నది. శుక్రవారం ఇరు జట్ల మధ్య కీలకమైన మూడో టీ20 పోరు జరుగనుంది. కొట్టిన పిండి ల్లాంటి స్వదేశీ పిచ్‌లపై భారత్ వరుస విజయాల జోరు మీద కనిపిస్తుంటే, లంక కనీసం పరువైనా నిలుపుకోవాలని చూస్తున్నది. ఇటీవల ప్రతిష్టాత్మక వన్డే ప్రపంచకప్ గెలిచి మంచి జోరుమీదున్న కౌర్‌సేన.. పొట్టి ఫార్మాట్‌లోనూ అదరగొట్టాలని పట్టుదలతో ఉంది. యువ బ్యాటర్లు షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్ సూపర్ ఫామ్ మీదున్నారు. మరోవైపు కిందటేడాది భారత్‌పై చివరిసారి గెలిచిన లంక..సిరీస్‌లో పుంజుకోవాలని చూస్తున్నది.

నేటి నుండి బాక్సింగ్‌డే టెస్టు

యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య బాక్సింగ్ డే టెస్టుకు సమయం ఆసన్నమైంది. 11 రోజుల వ్యవధిలో యాషెస్ సిరీస్‌ను తిరిగి ఒడిసిపట్టుకున్న ఆసీస్.. మిగిలిన రెండు టెస్టుల్లోనూ దుమ్మురేపాలని పట్టుదలతో ఉంది. శుక్రవారం నుంచి మొదలయ్యే నాలుగో టెస్టుకు ఇప్పటికే రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్, స్టార్ స్పిన్నర్ నాథన్ లియాన్ దూరం కాగా, పిచ్‌ను ముందే అంచనా వేసిన ఆసీస్ అందుకు తగ్గట్లు పావులు కదుపుతున్నది. పచ్చికతో కళకళలాడుతున్న మెల్‌బోర్న్ పిచ్‌పై పటిష్టమైన పేస్ దళంతో ఇంగ్లండ్ జట్టును దెబ్బతీయాలని చూస్తున్నది. ఇందులో భాగంగా నాలుగేండ్ల తర్వాత జే రిచర్డ్‌సన్ తిరిగి జట్టులోకి చోటు దక్కించుకోగా, బ్రెండన్ డగెట్, మిచెల్ నెసెర్ లాంటి యువ బౌలర్లు సత్తాచాటేందుకు తహతహలాడుతున్నారు. మరోవైపు సిరీస్ చేజార్చుకుని తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న ఇంగ్లండ్.. బెతెల్‌ను జట్టులోకి తీసుకుంది.

ఐపీఎల్‌లో తీసుకోలేదు... డబుల్ సెంచరీతో జవాబిచ్చాడు

ఒడిశాకు చెందిన 25 ఏళ్ల స్వస్తిక్ సామల్ ఐపీఎల్ లో ఆడాలని కలలు కంటున్నాడు. అంతేకాక ఐపీఎల్‌లో ఆడేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తాడు. కానీ ప్రతీసారి అతడికి నిరాశే ఎదురైంది. అయినా నిరుత్సాపడకుండా... ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఈ క్రమంలో ఐపీఎల్ 2026 మినీ వేలంలో కూడా అతడు తన పేరును రూ.30 లక్షల కనీస ధరకు రిజిస్టర్ చేసుకున్నాడు. అయితే ఈ సారి కూడా అతడికి నిరాశే మిగిలింది. దురదృష్టవశాత్తూ తుది వేలం జాబితాలో స్వస్తిక్ కి చోటు దక్కలేదు. కానీ అతడు కొంచెం కూడా బాధ పడలేదు. తన సత్తాను మైదానంలోనే చూపించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో విజయ్ హాజారే ట్రోఫీలో భాగంగా అలూర్ వేదికగా సౌరాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో స్వస్తిక్ సామల్ డబుల్ సెంచరీతో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన స్వస్తిక్.. ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు. అలూర్ గ్రౌండ్ లో బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 169 బంతుల్లో 21 ఫోర్లు, 8 సిక్సర్లతో ఏకంగా 212 పరుగులు చేశాడు. ఫలితంగా తొలుత బ్యాటింగ్ చేసిన ఒడిషా నిర్ణీత 50 ఓవర్లలో ఏకంగా 6 వికెట్ల నష్టానికి 345 పరుగులు చేసింది. అయితే స్వస్తిక్ ద్విశతకం వృథా అయింది. ఒడిషా జట్టు ఓటమి పాలైంది. 346 పరుగుల టార్గెట్ తో బ్యాటింగ్ కు దిగిన సౌరాష్ట్ర 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఒడిశా ఓడిపోయినప్పటికి స్వస్తిక్ సామల్ ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు. అంతేకాకుండా లిస్ట్‌ఏ క్రికెట్‌లో డబుల్ సెంచరీ సాధించిన తొలి ఒడిశా ప్లేయర్‌గా స్వస్తిక్ చరిత్ర సృష్టించాడు. ఈ అత్యధిక వ్యక్తిగత స్కోర్ సాధించిన ఐదవ ఆటగాడిగా ఏకంగా సంజూ శాంసన్ (212*) రికార్డును సమం చేశాడు. దీంతో సామల్ గురించి తెలుసుకోవడానికి నెటిజన్లు ఆసక్తి చూపుతున్నారు.

తెలంగాణ ప్రొ బాస్కెట్‌బాల్ లీగ్ టైటిల్ విజేత హైదరాబాద్

అరంగేట్రం తెలంగాణ ప్రొ బాస్కెట్‌బాల్ లీగ్ (టీపీబీఎల్)లో హైదరాబాద్ హనీ బ్యాడ్జర్స్ టైటిల్ విజేతగా నిలిచింది. గురువారం రాత్రి యూసుఫ్‌గూడ ఇండోర్ స్టేడియంలో జరిగిన లీగ్ ఫైనల్లో హైదరాబాద్ 7063 పాయింట్లతో నిజాం నవాబ్స్‌పై అద్భుత విజయం సాధించింది. ఆద్యంతం ఆఖరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో హైదరాబాద్ ప్లేయర్లు సమష్టి ప్రదర్శనతో సత్తాచాటారు. లీగ్ విజేత హైదరాబాద్‌కు రూ.20లక్షలతో పాటు అత్యంత విలువైన ఆటగానికి యమహా ఆర్15 బైక్‌ను అందజేశారు. పోటీల ముగింపు కార్యక్రమానికి మాజీ మంత్రి సబితాఇంద్రా రెడ్డి హాజరయ్యారు. ప్రొఫెషనల్‌గా బాస్కెట్‌బాల్ టోర్నీని ఘనంగా నిర్వహించిన రాష్ట్ర అసోసియేషన్‌ను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (టీబీఏ) అధ్యక్షుడు రావుల శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పృధ్వీశ్వర్‌రెడ్డి, టీవోఏ కార్యదర్శి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భర్త మహాశయులకు విజ్ఞప్తి క్రిస్మస్ స్పెషల్ పోస్టర్ రిలీజ్

మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో ఈ సంక్రాంతికి అద్భుతమైన వినోదాన్ని అందించడానికి సిద్ధంగా ఉన్నారు. ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై మ్యాసీవ్ బజ్‌ను సృష్టించాయి. తాజాగా మేకర్స్ క్రిస్మస్ విషెస్ అందిస్తూ సినిమా నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. రవితేజ సాంటా క్యాప్ పెట్టుకుని, చేతిలో గిఫ్ట్ పట్టుకుని ఫెస్టివ్ వైబ్ లో కనిపించడం అందర్నీ ఆకట్టుకుంది. భర్త మహాశయులకు విజ్ఞప్తి అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైన్‌మెంట్ తో సంక్రాంతికి పర్ఫెక్ట్ మూవీ గా ప్రేక్షకుల్ని అలరించబోతుంది.

'గత వైభవం' జనవరి 1న తెలుగులో

గ్రాండ్ ఫాంటసీ విజువల్ వండర్ 'గత వైభవం' గత నెలలో కర్ణాటక వ్యాప్తంగా థియేటర్లలో విడుదలై భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఎస్ఎస్ దుష్యంత్, ఆషిక రంగనాథ్ నటించిన ఈ చిత్రానికి సునీ దర్శకత్వం వహించడమే కాకుండా, దీపక్ తిమ్మప్పతో కలిసి ఈ ప్రాజెక్ట్‌కు సహ నిర్మాతగా కూడా వ్యవహరించారు. సర్వేగర సిల్వర్ స్క్రీన్స్‌తో కలిసి సునీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రం ఇప్పుడు గ్రాండ్‌గా తెలుగులో విడుదల కావడానికి సిద్ధమవుతోంది. కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నేతృత్వంలోని ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ ఈ చిత్రాన్ని జనవరి 1న తెలుగులో గ్రాండ్‌గా రిలీజ్ చేయనుంది. ఇది న్యూ ఇయర్ కి స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలవనుంది. ఈ అనౌన్స్‌మెంట్ ని ఒక అద్భుతమైన పోస్టర్ ద్వారా రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో చూపించినట్లుగా కథ నాలుగు విభిన్న కాలాలలో సాగుతుంది. కన్నడ వెర్షన్‌కు అద్భుతమైన స్పందన లభించడంతో, తెలుగు ప్రేక్షకులలో అంచనాలు భారీగా పెరిగాయి. పండుగ లాంటి నూతన సంవత్సర విడుదల ఈ చిత్రంపై ఉన్న ఉత్సాహాన్ని మరింత పెంచుతోంది.



చిరు, వెంకీ ఫ్యాన్స్‌కి నిజమైన పండుగ

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి లీడ్ రోల్ లో రూపొందుతున్న మన శంకర వరప్రసాద్ గారు మూవీలో విక్టరీ వెంకటేష్ స్పెషల్ రోల్ లో సందడి చేయనున్న విషయం తెలిసిందే. తొలుత అతిథి పాత్రలో వెంకీ కనిపిస్తారని తెలిసినా.. ఆ తర్వాత ఆయన రోల్ రన్ టైమ్ ను పెంచారట. ఆ స్క్రీన్ టైమ్ లో ఇద్దరు స్టార్ హీరోల కాంబోలో సాంగ్ కూడా ప్లాన్ చేశారు డైరెక్టర్ అనిల్ రావిపూడి. నిజానికి చిరంజీవి, వెంకటేష్ ఒకే మూవీలో నటించడం ప్రత్యేకం. దానికి తోడు వారి కాంబినేషన్ లో సాంగ్ ఉండడంతో ఇటు సినీ ప్రియులు.. అటు ఇద్దరి హీరోల అభిమానులు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా మాస్ సాంగ్ ప్లాన్ చేశారని తెలియడంతో ఓ రేంజ్ లో అంచనాలు పెట్టుకున్నారు. కచ్చితంగా థియేటర్స్ దద్దరిల్లడం ఖాయమని అంతా ఫిక్స్ అయిపోయారు. అదే సమయంలో చిరు, వెంకీ సాంగ్ అప్డేట్ కోసం ఇప్పుడు వెయిట్ చేస్తున్నారు. రీసెంట్ గా ఆది సాయి కుమార్ నటించిన శంభాల ప్రీ రిలీజ్ ఈవెంట్ లో త్వరలో సాంగ్ ను రిలీజ్ చేస్తామని అనిల్ రావిపూడి తెలిపారు. నేడు క్రిస్మస్ స్పెషల్ గా చిన్న అప్డేట్ ఇచ్చారు. చిరంజీవి, వెంకటేష్ సాంగ్ అప్డేట్ ను శుక్రవారం ఇస్తామని వీడియోతో వెల్లడించారు. ఆ వీడియోలో కారులో చిరంజీవి, వెంకటేష్ వెళ్తున్నట్లు చూపించారు. వారి ఫేసెస్ ను రివీల్ చేయకపోయినా.. గ్లాసెస్ ను చేతులతో పట్టుకున్నట్లు చూపించారు. ఇంతలో వారి కోసం పెద్ద సంఖ్యలో అభిమానులు వెయిట్ చేస్తుంటారు. బిగ్గెస్ట్ సెలబ్రేషన్స్, ఆంథమ్ ఆఫ్ ది సీజన్, మెగా విక్టరీ మాస్ సాంగ్ అంటూ క్యాప్షన్స్ ఇస్తూ అంచనాలు పెంచారు. అయితే వీడియో బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ ఆకట్టుకునే ఉంది. ప్రస్తుతం ఆ గ్లింప్స్.. సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో నెటిజన్లు, సినీ ప్రియులు రెస్పాండ్ అవుతున్నారు. సాంగ్ కోసం ఎంతో ఈగర్ గా వెయిట్ చేస్తున్నట్లు చెబుతున్నారు. గ్లింప్స్ ను చూస్తుంటే.. పాట ఓ రేంజ్ లో ఉండనుందని అర్థమవుతుందని కామెంట్లు పెడుతున్నారు.

'జెట్లీ' నుంచి వెన్నెల కిషోర్ ఫస్ట్ లుక్ రిలీజ్

టాలీవుడ్ ఫేవరేట్ ద్వయం సత్య, దర్శకుడు రితేష్‌రానా 'జెట్లీ'తో అలరించబోతున్నారు. మేకర్స్ ముందుగా రిలీజ్ చేసిన పోస్టర్స్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. క్లాప్ ఎంటర్టైన్మెంట్ చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మిస్తున్న జెట్లీని మైత్రి మూవీ మేకర్స్ సమర్పిస్తున్నారు. మేకర్స్ క్రిస్మస్ విషెస్ అందిస్తూ ఈ సినిమా నుంచి వెన్నెల కిషోర్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. విమానం విండో సీట్ దగ్గర వెన్నెల కిషోర్ కూర్చుని స్టైలిష్ హెయిర్‌స్టైల్‌తో కాన్ఫిడెంట్‌గా చూస్తున్న లుక్ ఆకట్టుకుంది. వెన్నెల కిషోర్ చేతిలో వున్న సినిమా సుదోకు బుక్ రితేష్ రానా మార్క్ ఫన్ తో అలరించింది. రితేష్ రానా అద్భుతమైన నేరేషన్, క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ విజన్, మైత్రీ మూవీ మేకర్స్ బ్యాకింగ్... అన్నీ కలిసి 'జెట్లీ' అద్భుతమైన ఎంటర్‌టైనర్ కానుంది. జెట్లీ తో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా హీరోయిన్‌గా టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. అజయ్ ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200